ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 6 సంచిక: 120, పేజీలు - 08

శనివారం,అక్టోబర్ 31, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

హైదరాబాద్ / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మియాపూర్ లోని రూ. 50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలియజేశారు. నాటి సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్ రావు, గోల్డ్ స్టోన్ ప్రసాద్ ద్వారా ఈ విలువైన మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారని ఆరోపించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విలువైన భూములను కబ్జా చేయడానికి చూశారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా ఈ కబ్జా వ్యవహారాలపై పోరాడడంతోనే తనపై కక్ష గట్టి జైలుకు కూడా పంపారని అన్నారు. మియాపూర్ భూముల విషయంలో దామోదర్ రావుకు ముందుగానే విలాసవంతమైన కార్లను లంచంగా ఇచ్చారని, కేసీఆర్ కు నగదు రూపంలో ముడుపులు ముట్టజెప్పారని సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భూముల రక్షణ కోసం కోర్టులో బలమైన వాదనలు వినిపించిందని, తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఆ భూముల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల కబ్జాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకు తమ ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మియాపూర్ లోని ఈ విలువైన భూములను విక్రయించడం ద్వారా వచ్చే నిధులను నీటిపారుదల, విద్యా, వైద్యం తదితర సంక్షేమ రంగాలకు కేటాయిస్తామని, ముఖ్యంగా విద్యారంగ అభివృద్ధికి ఎక్కువగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై త్వరలోనే క్యాబినెట్ లో చర్చించనున్నట్లు వెల్లడించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

2లో..

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం

2లో..

చరిత్రలో తొలిసారి రైతులను పంటలు వేయొద్దన్న

అసమర్థ సీఎం

- ఇంద్రవెల్లి సభలో కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆదివాసీల వీరభూమి, పోరాటాలకు పురిటిగడ్డ అయిన ఇంద్రవెల్లి సాక్షిగా తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలపై సంచలన విమర్శలు చేశారు. ఇంద్రవెల్లి వేదికగా తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తోంది. ఈ సభలో స్వాతంత్ర్యం కోసం, హక్కుల కోసం ప్రాణాలర్పించిన రామ్ జీ గొండు, వన్నెల ఎల్లన్న, వెడమ రాము, జల్-జమీన్-జంగల్ వీరుడు కొమురం భీమ్, శిడెం శింబు, కొమురం సూరుల స్ఫూర్తికి పాదాభివందనం చేస్తూ కవిత తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆనాడు తమ పంటలను కాపాడుకునేందుకు సమావేశమైన ఆదివాసీలపై కాల్పులు జరిపిన చరిత్ర కాంగ్రెస్‌దని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు

రైతులను, ఆదివాసీలను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని కవిత ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి, కేవలం రూ. 5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. "చరిత్రలో రైతులను పంట వేయవద్దని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే. వ్యవసాయం తప్ప వేరే పని తెలియని రైతులకు ఏ విధంగా ఆదుకుంటారో చెప్పకుండా పంట వద్దంటే ఆయన పదవిలో ఎందుకు ఉండాలి?" అని ప్రశ్నించారు. రెండు నెలలకు ఒకసారి ఆదిలాబాద్‌కు వస్తానని చెప్పిన సీఎం, మూడేళ్లలో కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారని, ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. 152 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు కట్టి 148 మీటర్లలో నీళ్లు నిల్వ చేయకుండా, కరువు వచ్చిన తర్వాత బాయి

2లో..

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం

2లో..

కన్నీళ్లు తుడుస్తాం..

నష్టాలు భర్తీ చేస్తాం!

- నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- తుపాను బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల తక్షణ సాయం
- రూ.4,600 కోట్ల నష్టంపై కేంద్రానికి నివేదిక
- నేడు సాయంత్రం లేదా ఎల్లుండి నాటికి ప్రతి ఇంటికీ విద్యుత్ పునరుద్ధరణ
- బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు పరిహారం.. బాధితులకు నిత్యావసర సరుకులు

అమరావతి (ప్రశ్న న్యూస్) తుపాను కష్టాల్లో చిక్కుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. ప్రకృతి విపత్తుతో నష్టపోయిన

2లో..

గర్ల్స్ హాస్టల్ పేరుతో గలీజ్ దందా!

- యువతులతో వ్యభిచారం, అండాల సేకరణ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని బేగంపేట ప్రాంతంలో గర్ల్స్ హాస్టల్ పేరుతో సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ అండాల సేకరణ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. యువతుల నుంచి అండాలు సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రకాశ్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ తనిఖీల్లో బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 10 మంది యువతులు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రకాశ్‌నగర్‌లోని నత్రాన్ అపార్ట్‌మెంట్‌లో 'అమీ నీతా గర్ల్స్ హాస్టల్' పేరుతో గత ఏడాది కాలంగా కార్యకలాపాలు

2లో..

హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రైలు

- తెలంగాణకు మరో భారీ రైల్వే ప్రాజెక్ట్!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ - పుణె, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం వెల్లడించారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ - కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని

2లో..

పట్టణ స్థానిక సంస్థలకు

ముగిసిన ఎన్నికల ప్రచారం

- ఇక ఆంక్షలు మీరితే కఠిన చర్యలే

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో స్థానిక సంస్థల ఎన్నిక ప్రచారం ముగిసింది. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం ఐదు గంటలతో క్లోజ్ అయింది. మైక్‌ల్లో ప్రచారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, రోడ్ షోలు వంటి ప్రచారం పూర్తిగా తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ ఒకటో తేదీన పోలింగ్ జరగనుంది. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు

2లో..

హైదరాబాద్‌ను

ముంచెత్తిన భారీ వర్షం

- నగరవ్యాప్తంగా జలదిగ్బంధం, అస్తవ్యస్తమైన జనజీవనం
- ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో బెంబేలు
- ఐటీ కారిడార్‌లో నిలిచిన వాహనాలు, పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభన

2లో..

యాసంగిలో రైతు భరోసా

లేనట్టేనా..?

- రేవంత్ సర్కారు మదిలో ఏముంది.?

2లో..

లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించామని వివరించారు. పూర్వపు ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కేటీఆర్ కొట్టేయాలని చూస్తే న్యాయపోరాటం ద్వారా అడ్డుకున్నామని, అలాగే కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కాజేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తే కోర్టులో పోరాడి గెలిచామని పేర్కొన్నారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జా చేయాలని చూస్తే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడామని, ప్రభుత్వం వినిపించిన వాదనలతో అది అటవీ భూమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. మంచిరేవులలోని 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్ తో కలిసి కబ్జా చేయడానికి యత్నిస్తే దానిని రక్షించి, ప్రస్తుతం అక్కడ పోలీసుల పిల్లల కోసం స్కూళ్లను ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే, సుప్రీం కోర్టులో పోరాడి దాన్ని తిరిగి దక్కించుకున్నాం అన్నారు., భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నామని చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి సంక్షేమ పనులపై సమగ్ర అధ్యయనం చేస్తుందని వివరించారు. మరోవైపు హరీష్ రావు మామ హనుమంత రావు కబ్జా చేసిన భూములను సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారని, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. భూముల ఆక్రమణలపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని, కానీ శాసనసభలో దీనిపై చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగలాలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని, కనీసం రక్షించిన రెవెన్యూ అధికారులను ఎందుకు అభినందించడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీష్ రావులు అధికారంలోకి వచ్చాక ఆ భూములను స్వాధీనం చేసుకోకుండా, తాము ఎవరిపై కేసులైతే వేశారో వారితోనే లాలూచీ పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా మియాపూర్ భూములపై కుట్రలు మానాలని సీఎం హితవు పలికారు. తమ భూముల ఆక్రమణలపై, ప్రభుత్వ చర్యలపై నేరుగా చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. గతంలో రెండు గ్రామాల మధ్య ఉన్న భూవివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారని, అక్కడ జరిగిన ఆక్రమణలను తేల్చి ఆ స్థలంలో తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి పేరిట అమరవీరుల కాలనీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని కబ్జాలు చేయడం మానుకోవాలని, వారు చేసిన అక్రమాలకు వ్యతిరేకంగానే కోర్టులు వరుసగా తీర్పులు ఇస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

కన్నీళ్లు తుడుస్తాం.. నష్టాలు భర్తీ చేస్తాం!

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని, గ్రామాల్లో చివరి వ్యక్తికి సైతం సహాయం అందే వరకు స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రకటించారు. తుపాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. విపత్తు తీవ్రతను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడంతో భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వరుసగా రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మెట్రేవుల్లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. అక్కడ కల్పిస్తున్న భోజన వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని గ్రామస్థులు సీఎంకు వివరించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. తుపాను వల్ల జరిగిన నష్టాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తామని స్పష్టం చేశారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులను కూడా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పెద్ద ఎత్తున నష్టం నివారించాం

తుపాను ముప్పును ముందుగానే అంచనా వేసి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడికక్కడ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. తెలంగాణ నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది సైతం సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్నారని చెప్పారు. రేపు సాయంత్రం లేదా ఎల్లుండి నాటికి జిల్లాలోని ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.

రూ.4,600 కోట్ల నష్టంపై కేంద్రానికి నివేదిక

తుపాను కారణంగా రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం రూ.4,600 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేంద్రానికి మెమోరాండం పంపించామని వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. బాధితులకు తక్షణ సాయం అందించడంతో పాటు దీర్ఘకాలిక పునరుద్ధరణ చర్యలపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలి

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నీటితో నిండాయని చంద్రబాబు తెలిపారు. దీంతో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి నీటి ఇబ్బందులు ఉండవని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తు సృష్టించిన సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకునే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మరోవైపు విపత్తు సమయంలో నిరంతరం శ్రమించిన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సహాయక సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. కష్టకాలంలో వారు అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ప్రశంసించారు. బాధితులందరికీ న్యాయం జరిగే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

చరిత్రలో తొలిసారి రైతులను పంటలు వేయొద్దన్న అసమర్థ సీఎం

తవ్వినట్లు ఇప్పుడు మహారాష్ట్రతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ముఖ్యమంత్రి అసలు ఆ పదవిలో ఎందుకు కొనసాగాలి?. చరిత్రలో మొట్టమొదటి సారి పంటలు వేయొద్దు అని చెప్పిన అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి. పంటలు వేయకుండా రైతులు ఎట్లా బతకాలి?" అని ఆమె ప్రశ్నించారు.

సిరిసిల్ల, సిద్దిపేట బాబుల తర్జన భర్జన

బీఆర్ఎస్ సభపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ చేస్తోంది రైతు గర్జన కాదని, సిరిసిల్ల బాబు (కేటీఆర్), సిద్దిపేట బాబు (హరీష్ రావు) మధ్య ఆధిపత్య పోరులో కార్యకర్తలు పడుతున్న తర్జన భర్జన అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ స్వయంగా మాటిచ్చి కూడా కొమరం భీమ్ యూనివర్సిటీని, ఇంజినీరింగ్ కాలేజీని పదేళ్లలో ఎందుకు ఇవ్వలేదో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ మిల్లుకు వెయ్యి కోట్లు ఇచ్చినా కార్మికులకు మేలు జరగలేదని, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను ఎందుకు తెరిపించలేదని నిలదీశారు. చనఖా కొరటా ప్రాజెక్ట్ ఖర్చును రూ. 368 కోట్లనుంచి ఏకంగా రూ. 2100 కోట్లకు పెంచారని, ఈ అవినీతి సొమ్ము మాజీ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న ఇళ్లకు పోయిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో 80 లక్షల క్వింటాళ్ల పత్తి పండుతున్నా కనీసం ఒక టెక్స్‌టైల్ పార్క్ ఎందుకు నిర్మించలేదని నిలదీశారు.

బీజేపీ మత రాజకీయం

ఆదిలాబాద్ లోని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ లు రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వకుండా కాపాడుతున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో హిందూ, ముస్లింలు శాంతియుతంగా ఉండాలని భావిస్తే, బీజేపీ మాత్రం మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని చూస్తోందని హెచ్చరించారు.

'పాంచజన్యం' సభతో టీఆర్ఎస్ హామీలు

1. అన్ని పార్టీలు ప్రజలను మోసం చేసిన వేళ, ఒక కొత్త రాజకీయ శక్తిగా తమ ప్రాధాన్యతలను "పాంచజన్యం" రూపంలో కవిత ప్రకటించారు.
2. మెరుగైన ఉచిత విద్య, వైద్యం: ప్రైవేట్ రంగంలో సైతం పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.
3. యువతకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్లతో వ్యాపార రుణాలు: యువత ఆలోచనలకు అనుగుణంగా సొంత వ్యాపారాలు పెట్టుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు.
4. రైతులకు పూర్తి మద్దతు: రైతులకు ఉచిత నీరు, కరెంట్, యూరియా అందిస్తూ వారి గౌరవాన్ని కాపాడటం.
5. ఆదివాసీల హక్కులు: ఐటీడీఏ లో జీవో 57 తో సహా 27 జీవోలను పునరుద్ధరించడం, 1972 లో ఆస్తులు కొనుగోలు చేసిన ఆదివాసీలకు న్యాయం చేయడం.
6. ఆరోగ్య పరిరక్షణ: రక్తహీనతతో బాధపడుతున్న ఆదివాసీ మహిళలకు పోషకాహార పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం.

సీసీఐ మూతపడటానికి కారణం

ఆదిలాబాద్‌లోని ప్రతిష్టాత్మక 'సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' మూతపడటానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలే కారణమని కవిత ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఉత్తర తెలంగాణ ప్రయోజనాలను విస్మరించాయని దుయ్యబట్టారు.

పట్టణ స్థానిక సంస్థలకు ముగిసిన ఎన్నికల ప్రచారం

చేపట్టి ఫలితాలను తెలియజేస్తారు.

ఈ నిబంధనలు మీరితే చర్యలే..

ఇక నియోజకవర్గాల్లో బహిరంగ ప్రచారం అంటే లౌడ్ స్పీకర్లు, ప్రచార రథాలను రోడ్లపైకి తీసుకురావడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. అలాగే ఆయా నియోజకవర్గాల్లో ఓటు హక్కు లేని రాజకీయ నేతలు, బయటి ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తక్షణం ఆ ప్రాంతం విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే హోటళ్లు, లాడ్జీలు, కళ్యాణ మండపాల్లో ఎవరైనా ఉన్నారేమోనని పోలీసులు ముమ్మర తనఖీలు చేస్తారు. అదేవిధంగా ప్రచారం ముగిసిన సమయం నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు మద్యం క్రయ, విక్రయాలపై నిషేధం ఉంటుంది. వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు క్లోజ్ చేయాలి.. ఓపెన్ చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది కాబట్టి గుంపులుగా చేరకూడదు, డబ్బు, మద్యం పంపిణీ చేసినా, ఓటర్లను బెదిరించినా కేసులు నమోదు చేసే అవకాశం కూడా ఉంటుంది.

కూటమి ఖాతాలో ఏకగ్రీవాలు..

పోలింగ్ జరగక ముందే రాష్ట్రంలో కూటమి భారీగా ఏకగ్రీవాలను తన ఖాతాలో వేసుకుంది. 17 మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో 15 స్థానాలు టీడీపీవే ఉన్నాయి. ఒకటి జనసేన, మరొకటి బీజేపీ సొంతం చేసుకున్నాయి. మరోవైపు పోలింగ్ ప్రక్రియను సామరస్యంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పక్కాగా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే దీనికి సంబంధించి సన్నాహాలు చేసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా నామినేషన్‌ల ప్రక్రియలో జరిగిన ఘర్షణలు జరగక్కుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గర్ల్స్ హాస్టల్ పేరుతో గలీజ్ దందా!

సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఉంటున్న యువతుల అండాలను అక్రమంగా సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ దాడుల్లో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న యువతులను గుర్తించి విచారించారు. అక్కడ బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా ప్రాంతాలకు చెందిన సుమారు పది మంది యువతులు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ 10 మంది యువతులను పోలీసులు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతుల నుంచి అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారా.. ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉంది.. అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో ఒక మహిళ కీలక పాత్ర పోషిస్తున్నట్లు అనుమానిస్తున్న పోలీసులు ఆమెను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అండాల సేకరణతో పాటు వాటి విక్రయాలు, సరఫరా వ్యవస్థ, సంబంధిత సంతాన సాఫల్య కేంద్రాల పాత్రపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. పురుషుల వీర్యకణాల సరఫరాకు కూడా ఈ వ్యవహారంతో సంబంధం ఉందా అనే కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గర్ల్స్ హాస్టల్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఈ ఘటనలో తెరపైకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, వాటిపై పోలీసుల నిర్ధారణ ఇంకా వెల్లడికాలేదు. యువతులను ఏ పరిస్థితుల్లో అక్కడ ఉంచారు అండాల సేకరణకు వారి సమ్మతి ఉందా వైద్యపరమైన నిబంధనలు పాటించారా అనే అంశాలు కూడా దర్యాప్తులో కీలకంగా మారనున్నాయి.

హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రైలు

సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్- గద్వాల్, కల్వకుర్తి - మాచర్ల, కాచిగూడ కాచిగూడ - జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు - ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ - లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు.

ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

యాసంగిలో రైతు భరోసా లేనట్టేనా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదైంది. దీంతో అక్టోబర్‌లోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈసారి వేసవిలో నీటి కొరత తలెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పదే పదే సూచిస్తోంది. నీటి కొరత కారణంగా రబీలో వరిసాగు చేయొద్దని కూడా రైతులకు ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. నీటి వసతి అందుబాటులో ఉన్న చోట ఆరుతడి పంటలకు మాత్రమే పరిమితం కావాలని కోరుతోంది. సాగునీరు అందుబాటులో లేకపోవడంతో.. ఈసారి యాసంగి సీజన్లో రైతులు పంటలు సాగు చేసే అవకాశం కనిపించడం లేదు. దీంతో పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా ను వేయాలా వద్దా అనే విషయమై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోందని తెలుస్తోంది. వానా కాలం ఎకరానికి రూ.6 వేలు, యాసంగిలో మరో రూ.6 వేలు చొప్పున ఏడాదికి రూ.12 వేలను రైతు భరోసా రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం 70.40 లక్షల మంది పట్టాదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. వానా కాలం సీజన్లో రూ.9 వేల కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. యాసంగిలో పంటలు సాగు చేసే పరిస్థితులు లేవు కాబట్టి.. పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసా నిధులను ఎలా రైతులకు అందిస్తారే ప్రశ్న వినిపిస్తోంది.

ఒకవేళ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోతే ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురయ్యే అవకాశం ఉంది. రైతులు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీంతో యాసంగి రైతు భరోసా విషయంలో ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. ఈసారికి పంటలు సాగు చేయకపోయినా మినహాయింపు ఇచ్చి రైతు భరోసా ఇస్తే ఎలా ఉంటుందనేది కూడా ప్రభుత్వం ముందు చర్చకు ఉంది. పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసా రూపంలో కాకుండా రైతులకు కరువు సాయంగా అందిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది. అయితే ఎకరానికి రూ.6 వేలు ఇస్తారా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆ మొత్తాన్ని మారుస్తారా అనేది కూడా తేలాల్సి ఉంది. యాసంగి సీజన్ రైతు భరోసా ఇవ్వడానికి మరో రెండు నెలల సమయం ఉంది. కాబట్టి ఈలోగా మంత్రివర్గం సమావేశమై ఈ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా రైతు భరోసా అందించి.. మిగతా రైతులకు కరువు సాయం రూపంలో అందించే అవకాశం కూడా కనిపిస్తోంది. కరువు ప్యాకేజీ కింద తమకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని ఇప్పటికే కోరింది. అయితే కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువే.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం వరకు సాధారణంగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం 5 గంటల నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. చాలా రోజుల తర్వాత కురిసిన భారీ వర్షం నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు రానున్న నాలుగైదు రోజుల పాటు వర్ష సూచన ఉండటంతో వాతావరణ శాఖ రెయిన్ అలర్ట్ ప్రకటించింది.

రహదారులపైకి వరదనీరు.. ట్రాఫిక్ కష్టాలు

భారీ వర్షం, ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా సాయంత్రం వేళ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు ముగిసే సమయం కావడంతో రహదారులపై రద్దీ అధికంగా ఉంటుంది.

దీనికి వర్షం తోడవడంతో నగరంలోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. తొలుత కాప్రా పరిధిలో ప్రారంభమైన వర్షం కొద్దిసేపటికే నగరంలోని అనేక ప్రాంతాలకు విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

బహదూర్‌పురాలో అత్యధిక వర్షపాతం

నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురాలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

మాదాపూర్‌లో 5.7, షేక్‌పేట్‌లో 5.5, చార్మినార్‌లో 4.7, జూబ్లీహిల్స్‌లో 4.4, అత్తాపూర్‌లో 4.3, సిఫ్‌నగర్‌లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఐటీ కారిడార్‌లో వాహనాల బారులు

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఐటీ హబ్‌గా పేరొందిన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పరిసరాల్లో రహదారులపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు మందగించాయి.

మాదాపూర్-హైటెక్ సిటీ-కేపీహెచ్‌బీ మార్గంలో మైండ్‌స్పేస్, ఐకియా పరిసరాల్లో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మాదాపూర్ సిటీ వైన్స్ సమీపంలోని ప్రధాన రహదారిపై వరదనీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ముందుకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు.

పలు మార్గాల్లో ట్రాఫిక్ జామ్

చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్-ఉప్పల్, బండ్లగూడ-నాగోల్ మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు. మరో నాలుగైదు రోజుల పాటు వర్ష సూచన నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ : దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ఫ్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాలు పెరుగుదలే ప్రధాన కారణం.ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

మోడీకి సరే... మిగిలిన ఎన్నికల్లో ఏమౌతోంది

లక్నో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆధ్యాత్మిక రాజధాని వారణాసిలో ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇక్కడి నుంచి లక్షల ఓట్ల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేస్తూ వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి స్థానిక సంస్థలు, శాసనమండలి ఎన్నికల విషయానికి వచ్చేసరికి బీజేపీ సవాళ్లను ఎదుర్కొంటోంది. తాజాగా జరిగిన యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ భారీ తేడాతో నిలబెట్టుకుని బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాను మట్టికరిపించగా, పట్టభద్రుల స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి అశుతోష్ సిన్హా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నియోజకవర్గంలోనే విద్యావంతులు, ఉద్యోగ వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునివ్వడం రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది.2014లో నరేంద్ర మోదీ వారణాసి నుంచి లోక్‌సభకు ఎన్నికైన నాటి నుంచి గత పన్నెండేళ్ల స్థానిక ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఫలితాలు ఇలాగే వస్తున్నాయి. 2020లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిణామం ఎదురైంది. దాదాపు వందేళ్ల పాటు బీజేపీ చేతిలో ఉన్న వారణాసి గ్రాడ్యుయేట్స్, టీచర్స్ స్థానాలు రెండింటినీ సమాజ్‌వాదీ పార్టీ చేజిక్కించుకుని కమలనాథులకు ఊహించని షాక్ ఇచ్చింది. అంతకుముందు బీజేపీ అభ్యర్థి కేదార్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహించిన గ్రాడ్యుయేట్స్ సీటును ఎస్పీ ఎగరేసుకుపోవడం నాడే రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభలో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, పరోక్ష, విద్యావంతుల ఓటింగ్ విధానాల్లో మాత్రం స్థానిక అసంతృప్తులు బ్యాలెట్ బాక్సుల్లో బయటపడుతూనే ఉన్నాయి.ఎమ్మెల్సీ ఎన్నికలకే పరిమితం కాకుండా, వారణాసి జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీకి ఆశించిన స్థాయిలో పట్టు దక్కలేదు. 2015, 2021 పంచాయతీ ఎన్నికల్లో జిల్లా పంచాయతీ సభ్యుల స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ తో పాటు స్వతంత్రులే అధిక స్థానాల్లో గెలుపొందారు. క్షేత్రస్థాయి గ్రామీణ ఓటర్లలో బీజేపీ సొంత బలంతో సాధారణ మెజార్టీని సాధించలేకపోయింది; తదనంతర రాజకీయాల్లో ఇతర పక్షాల మద్దతుతో, అధికార బలాన్ని ఉపయోగించి జిల్లా పంచాయతీ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ.. బూత్ స్థాయి ప్రజాతీర్పుల్లో ఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులపై పైచేయి సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నగర ప్రాంత మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని బీజేపీ నిలబెట్టుకుంటున్నప్పటికీ, డివిజన్ వార్డుల్లో మాత్రం విపక్షాల గట్టి పోటీనిస్తూనే ఉన్నాయి.ప్రధానమంత్రి వ్యక్తిగత చరిష్మా, జాతీయవాదం, కాశీ విశ్వనాథ్ కారిడార్ వంటి భారీ ప్రాజెక్టులు లోక్‌సభ ఎన్నికల్లో నగర ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. అయితే లోకల్ బాడీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి ఓటర్ల ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయుల్లో పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, నిరుద్యోగం, విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలు, స్థానిక నాయకత్వంలోని గ్రూపు విభేదాలు ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా, మోదీని జాతీయ నేతగా అంగీకరిస్తున్న స్థానిక ఓటర్లు.. క్షేత్రస్థాయి విధానాలు, ఉపాధ్యాయ-ఉద్యోగ సమస్యల వద్దకు వచ్చేసరికి మాత్రం బీజేపీ అభ్యర్థులపై తిరుగుబాటు చేస్తూ సమాజ్‌వాదీ పార్టీకే జై కొడుతున్నారు.

క్లైమాక్స్‌కు విజయవాడ మేయర్

ఎన్నికల సమరం

విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుతున్న వేళ, క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు స్పష్టమైన ఏకపక్ష తీర్పును సూచిస్తున్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వంగవీటి రాధాకృష్ణ అనూహ్యమైన ప్రజా మద్దతుతో అత్యంత పటిష్టమైన స్థితిలో దూసుకుపోతున్నారు. బెజవాడ ప్రజానీకంలో వంగవీటి కుటుంబానికి ఉన్న భావోద్వేగ అనుబంధం, దివంగత రంగా అభిమానుల అండదండలతో పాటు, కూటమి పార్టీల ఓటు బ్యాంక్ ఏకతాటిపైకి రావడం రాధాకు ఆధిక్యాన్ని తెచ్చిపెడుతోంది. డివిజన్లలో కూటమి ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, సుజనా చౌదరి, జనసేన నేతలు సమన్వయంతో సాగిస్తున్న ప్రచారం రాధా విజయాన్ని ముందే ఖరారు చేసినట్లు కనిపిస్తోంది.గత మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఈసారి కనీస పోటీని కూడా ఇవ్వలేక ఘోరమైన ఆత్మరక్షణలో పడిపోయింది. రాధా వంటి మాస్ లీడర్‌ను ఢీకొట్టేందుకు బలమైన సామాజిక, రాజకీయ నేపథ్యం ఉన్న అభ్యర్థిని రంగంలోకి దించడంలో ఆ పార్టీ అధిష్ఠానం విఫలమైంది. ఓటమి ఖాయమని ముందే గ్రహించిన నగరానికి చెందిన ముఖ్య నేతలు, మాజీ మంత్రులు పోటీకి పూర్తిగా ముఖం చాటేశారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మికే మళ్లీ టికెట్ కేటాయించాల్సి వచ్చింది. అయితే ఆమె ప్రచారం ఏమాత్రం ఊపు లేకుండా అత్యంత సాదాసీదాగా సాగుతుండటం, గత ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి, పన్నుల భారం వంటి ప్రజావ్యతిరేక అంశాలు ఆమెకు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి.వైసీపీ శ్రేణుల్లో నెలకొన్న అంతర్గత అసంతృప్తి, ముఖ్య నేతల సహాయ నిరాకరణ భాగ్యలక్ష్మి అవకాశాలను పూర్తిగా సమాధి చేస్తున్నాయి. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు వంటి కీలక నేతలు ఎవరికి వారే నామమాత్రంగా దర్శనమిచ్చి వెళ్లిపోతుండటం కేడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నగరంలో ఎక్కడా వైసీపీ ప్రచార హోరు కనిపించకపోవడం, పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతో కార్పొరేటర్ అభ్యర్థులు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చేతులెత్తేస్తున్నారు. నాయకత్వ లేమి, సమన్వయ లోపంతో నగరంలో వైసీపీ ఉనికి కేవలం సోషల్ మీడియా పోస్టులకే పరిమితమవుతోంది. ఇదే సమయంలో, ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి ప్రత్యేక ఆకర్షణగా మారిన మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వ్యవహారం క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది. బెజవాడను నిజాయితీగా, అవినీతి రహితంగా తీర్చిదిద్దుతానంటూ ఆయన ప్రచారం మొదలుపెట్టినప్పటికీ.. ఆయన కార్యాచరణ అంతా ఏసీ రూములు, మేధావుల సదస్సులు, యూట్యూబ్ ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా లైవ్‌లకే పరిమితమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో బస్తీ ప్రజలు, సామాన్య కార్మికులు, నిరుపేద ఓటర్లను నేరుగా ఆకట్టుకునే మాస్ కనెక్ట్ ఆయన వద్ద లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. మేధావి వర్గంలో కొంత సానుభూతి లభించినా, అది విజయానికి అవసరమైన సంఖ్యాబలంగా మారే అవకాశాలు కనిపించడం లేదు.బెజవాడ ఎన్నికల ముఖచిత్రాన్ని పరిశీలిస్తే.. కూటమి అభ్యర్థి వంగవీటి రాధా ప్రచారంలోనూ, ప్రజాధారణలోనూ ప్రత్యర్థుల కంటే మైళ్ల దూరంలో ముందంజలో ఉన్నారు.

వంగవీటి కుటుంబానికి నగరంతో ఉన్న సుదీర్ఘ అనుబంధం, కూటమి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రాధాకు దన్నుగా నిలుస్తున్నాయి. విపక్ష వైసీపీ నిస్తేజం, ఏబీవీ ప్రభావం నామమాత్రమే కావడంతో.. బెజవాడ మేయర్ పీఠంపై కూటమి జెండా ఎగరడం లాంఛనమేనని స్పష్టమవుతోంది. రాజధాని నగర పరిధిలో విజయవాడ కార్పొరేషన్‌ను దక్కించుకోవడం ద్వారా అమరావతి బ్రాండ్‌ను, కూటమి రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకునే దిశగా రాధా ప్రయాణం సాఫీగా సాగుతోంది.

డోన్ మున్సిపాల్టీలో ఒంటరి పోరు

కర్నూలు, డోన్ మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో ఆధిపత్యం చలాయించిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, స్థానిక సంస్థల సమరంలో తమ పట్టు కోల్పోకుండా గట్టిగా పోరాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో , బేతంచర్ల వంటి సొంత మండలంలో తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదురై అభ్యర్థులు కొరవడినప్పటికీ, డోన్ పురపాలక సంఘం పరిధిలో మాత్రం తమ ఉనికిని కాపాడుకునేందుకు కోట్ల కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.డోన్ పట్టణ పరిధిలో వైఎస్సార్‌సీపీకి ఇంకా మిగిలి ఉన్న కొద్దిపాటి వర్గ బలాన్ని ఏకం చేసి, కనీసం పోటీ ఉందనే అభిప్రాయాన్ని కల్పించేందుకు బుగ్గన రోజూ ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, ఓటమి భయంతోనే ఆయన సానుభూతి కార్డ్ వాడుతున్నారని,కోట్ల సుజాతమ్మపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ద్వారా వివాదాన్ని రాజేసి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల సుజాతమ్మపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. స్వయంగా ఆమే మున్సిపల్ చైర్మన్ బరిలో ఉన్నారు.ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ డోన్ మున్సిపాలిటీని కూటమి ఖాతాలో వేసేందుకు వార్డుల వారీగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 32 వార్డుల్లో బలమైన స్థానిక నాయకులను పోటీలో నిలిపి, బుగ్గన హయాంలో జరిగిన అభివృద్ధి లోపాలు, అక్రమాలను ఓటర్ల ముందుకు తీసుకెళుతున్నారు. కోట్ల సుజాతమ్మనే మున్సిపల్ చైర్మన్ గా టీడీపీ హైకమాండ్ ఖరారు చేసింది. గతంలో ఎమ్మెల్యేగా చేసినప్పటికీ పోటీకి సుజాతమ్మ అంగీకరించిరంగంలోకి దిగారు. ఒకవైపు బుగ్గన డోన్ మున్సిపాలిటీలో గట్టిగా పోరాడుతున్నట్లు మీడియా ముందుకు వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నామినేషన్ల ఘట్టం నుంచే టీడీపీ-జనసేన కూటమి స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తోంది. బలమైన అభ్యర్థి కావడంతో బుగ్గన రాజేంద్రనాథ్ ఆరోపణలతో ఎదురుదాడి చేస్తున్నారు.

ఏలూరు మేయర్ పీఠం కోసం హోరాహోరీ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కోసం హోరాహోరీ సమరం నడుస్తోంది. కూటమి పొత్తు ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన ఈ మేయర్ స్థానానికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంటా మోహన్ రావు ప్రత్యర్థిగా తలపడుతున్నారు.కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికి స్థానిక రాజకీయాల్లో దశాబ్దాల క్షేత్రస్థాయి అనుభవం అతిపెద్ద బలం. గతంలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉండి, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఆయనకుంది. 2019 నుంచి ఏలూరు జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ పార్టీ కేడర్‌ను నిర్మించడంతో పాటు, ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా కార్మిక, ప్రజా సంఘాలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చరిష్మా, టీడీపీ-జనసేన సంప్రదాయ కాపు, బీసీ, బలిజ ఓటు బ్యాంకు ఒక్కతాటిపైకి రావడం ఆయనకు కొండంత అడ్వాంటేజ్. అయితే, ఏలూరు మేయర్ సీటు తమకే కావాలంటూ ప్రారంభంలో స్థానిక టీడీపీ కేడర్, ఆశావహులు వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యే బడేటి చంటి వర్గంతో సమన్వయం సాధించడంలో తొలుత ఎదురైన అంతర్గత అసంతృప్తి అప్పలనాయుడికి కొంత ప్రతిబంధకంగా మారాయి.మరోవైపు వైసీపీ అభ్యర్థి గంటా మోహన్ రావు కూడా నగరంలో బలమైన ఆర్థిక, సామాజిక వనరులున్న నాయకుడిగా బరిలోకి దిగారు. నగరంలోని బీసీ వర్గాలతో పాటు, సంప్రదాయంగా వైసీపీ వెన్నంటి నిలిచే మైనార్టీ, ఎస్సీ , కొన్ని కార్మిక వాడల ఓటు బ్యాంకుపై ఆయన ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలైన సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుస్తూ, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రచారం చేస్తూ కేడర్‌ను మోహరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, గత మున్సిపల్ పాలకవర్గంపై ఏలూరు ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, గతంలో నగరంలో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురైన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ నగరవాసుల మదిలో ఉండటం వైసీపీకి అతిపెద్ద మైనస్. అదీగాక, ఓటమి భయంతో నగరానికి చెందిన మాజీ మంత్రులు, కీలక వైసీపీ నేతలు ప్రచారానికి మొహం చాటేయడం, ఆయనకు పూర్తిస్థాయి అంగబలం కరువవ్వడం ప్రధాన బలహీనతగా మారింది.ఈ ఎన్నికల్లో డివిజన్ల స్థాయిలో కార్పొరేటర్ అభ్యర్థుల బలం మేయర్ పోరును ప్రత్యక్షంగా శాసిస్తోంది. నగరంలోని 62 డివిజన్లలో దాదాపు అన్ని చోట్లా కూటమి శ్రేణులు ముందస్తుగా సమన్వయ కమిటీలు వేసుకుని, బూత్ లెవల్ ప్రచారంలో స్పష్టమైన పైచేయి సాధించాయి. గతంలో తమ మధ్య ఉన్న అసంతృప్తులను పక్కనబెట్టి.. టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జనసేన నేతలు ఏకతాటిపైకి వచ్చి అప్పలనాయుడి తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు, వైసీపీకి చాలా డివిజన్లలో సమర్థులైన కార్పొరేటర్ అభ్యర్థులే దొరక్కపోవడం, బరిలో ఉన్నవారు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చతికిలపడటం మేయర్ అభ్యర్థి గంటా మోహన్ రావుకు క్షేత్రస్థాయిలో గొడ్డలిపెట్టుగా మారింది. సామాజిక సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న బీసీ, కాపు, వైశ్య, ఉద్యోగ వర్గాలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా, పెన్షన్ల పెంపు, దీపం-2' వంటి సంక్షేమ పథకాల వైపే స్పష్టంగా మొగ్గుచూపుతున్నాయి. అప్పలనాయుడికున్న క్లీన్ ఇమేజ్, స్థానిక నాయకత్వ పట్టు ఆయనకు సాధారణ తటస్థ ఓటర్లలోనూ ఆదరణ తెచ్చిపెడుతోంది. వైసీపీ కేవలం తమ పాత సంప్రదాయ ఓట్లను మాత్రమే నిలుపుకోగలుగుతుండగా, కొత్తగా ఓటర్లను ఆకర్షించే అంశాలేవీ ఆ పార్టీ వద్ద లేకపోవడం ప్రచారంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.మేయర్ ప్రత్యక్ష పోరులో కూటమి-జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికే దాదాపు 65 నుంచి 70 శాతం మేర స్పష్టమైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కేటాయింపు సమయంలో తలెత్తిన విభేదాలను అధిగమించి కూటమి శ్రేణులు ఏకతాటిపైకి రావడం ఆయనకు అతిపెద్ద రక్షాకవచంగా మారింది. దీంతో గంటా మోహన్ రావు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుని, అక్కడ జనసేన జెండా ఎగరడం దాదాపు లాంఛనమేనని అనుకోవచ్చు.

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

రాజమండ్రి : వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ద్రవ్యోల్బణ భారాన్ని సామాన్యులపై పడకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే దీపావళి పండుగ నుంచే రాష్ట్రంలోని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే సగానికి పైగా తక్కువ రేటుకే అందుబాటులోకి తేవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ మలక్పేట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్య నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీ నిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు. గుడిమల్కాపూర్, కిషన్బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

చిత్తూరు రాజకీయాల్లో ఆసక్తికర పోరు!

తిరుపతి : తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థి దశ నుంచే పరిచయమైన రాజకీయ నాయకుల మధ్య మొదలైన పోటీ, కాలక్రమంలో చిత్తూరు జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరింది. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఈ ముగ్గురి రాజకీయ ప్రయాణాలు 1978 ఎన్నికలతో కొత్త మలుపు తిరిగాయి. అయితే, వీరిలో పెద్దిరెడ్డి ప్రస్థానం ప్రత్యేకంగా నిలుస్తుంది. తొలి ప్రయత్నాల్లో పరాజయాలు ఎదురైనా, వెనకడుగు వేయకుండా తన రాజకీయ బలాన్ని పెంచుకుంటూ ముందుకు సాగారు. మరోవైపు చంద్రబాబు నాయుడు 1983 ఎన్నికల్లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరి కుప్పం నియోజకవర్గాన్ని తన రాజకీయ కంచుకోటగా మార్చుకున్నారు. ఇలా ఒకే కాలంలో రాజకీయాల్లోకి వచ్చిన నేతలు వేర్వేరు మార్గాల్లో ఎదిగినా, చిత్తూరు జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ప్రయాణం మాత్రం ఆరంభం నుంచే ఎత్తుపల్లాలతో సాగింది. 1978లో పీలేరు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయనకు తొలి ఎన్నికల్లోనే ఓటమి ఎదురైంది. కాంగ్రెస్ అభ్యర్థి మొగల్ సైపుల్లాబేగ్ విజయం సాధించడంతో అసెంబ్లీలో అడుగుపెట్టాలన్న ఆయన ఆశ నెరవేరలేదు. ఆ తర్వాత 1981లో చౌడేపల్లె సమితి ఎన్నికల్లో పోటీ చేసినా కెళవాతి రామకృష్ణారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. వరుస ఎదురుదెబ్బలు తగిలినా రాజకీయాలను విడిచిపెట్టకుండా తన ప్రయత్నాలను కొనసాగించారు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పీలేరు నుంచి పోటీ చేసినప్పటికీ మరోసారి ఓటమి తప్పలేదు. వరుసగా ఎదురైన ఈ ఫలితాలు ఆయన రాజకీయ లక్ష్యానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, నియోజకవర్గంలో తన రాజకీయ పునాదులను బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టారు.1989 ఎన్నికలు పెద్దిరెడ్డి రాజకీయ జీవితంలో కీలకమైన మలుపుగా నిలిచాయి. పీలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అయితే, ఆ విజయంతోనే ఆయనకు ఎదురులేని రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పలేం. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ శ్రీనాథరెడ్డి చేతిలో ఓటమి ఎదురైంది. కానీ 1999 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి తిరిగి విజయం సాధించారు. ఈ దశ నుంచి పెద్దిరెడ్డి రాజకీయ వ్యూహాలు, స్థానిక సమీకరణాలు, ప్రత్యర్థుల బలాబలాలను అంచనా వేసే తీరుపై చిత్తూరు జిల్లా రాజకీయాల్లో చర్చ పెరిగింది. ఎన్నికల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ, ఓటమి తర్వాత మళ్లీ పుంజుకోవడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధాన లక్షణంగా కనిపించింది. పీలేరులో ఏర్పరచుకున్న పునాది, తదుపరి రాజకీయ ఎదుగుదలకు బాటలు వేసింది.కాలక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం పీలేరు రాజకీయాలకే పరిమితం కాలేదు. పుంగనూరు నియోజకవర్గంలో తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంటూ చిత్తూరు జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగారు. మరోవైపు చంద్రబాబు నాయుడు కుప్పం కేంద్రంగా తన పట్టును కొనసాగించడంతో జిల్లాలో రెండు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. పెద్దిరెడ్డి తన రాజకీయ వారసత్వాన్ని కుటుంబ సభ్యులకూ విస్తరించారు. కుమారుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీగా, సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎమ్మెల్యేగా రాజకీయాల్లో కొనసాగడం కుటుంబ ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, ఎన్నికల విజయాలను కేవలం వ్యక్తిగత వ్యూహాలకే ఆపాదించలేం. స్థానిక నాయకత్వం, పార్టీ బలం, ప్రజల మద్దతు, నియోజకవర్గ సమస్యలపై స్పందన వంటి అంశాలూ కీలక పాత్ర పోషిస్తాయి. మొత్తంగా చూస్తే, తొలి ఓటముల నుంచి జిల్లా స్థాయి ఆధిపత్యం వరకు పెద్దిరెడ్డి సాగించిన ప్రయాణం చిత్తూరు రాజకీయాల్లో ఆసక్తికరమైన అధ్యాయంగా నిలుస్తోంది.

మచిలీపట్నంలో వర్ష బీభత్సం..

- రెండు రోజులైనా తగ్గని నీరు

- జలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

మచిలీపట్నం అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మచిలీపట్నం నగరం జలమయమైంది. ఎటు చూసినా రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ రహదారులపై నీరు ఏమాత్రం తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు డ్రైనేజీలను తలపిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, రహదారులపై సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఒకవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు రెండు రోజులైనా రోడ్లపై నీరు తగ్గకపోవడం నగర ప్రజలకు మరింత భారంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరలో బల్లి

హైదరాబాద్ జేఎన్‌టీయూ మంజీర హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి కనిపించడం కలకలం రేపింది. గురువారం రాత్రి డిన్నర్ చేసేందుకు వెళ్లిన విద్యార్థులకు వడ్డించిన కూరలో బల్లి కనిపించడంతో వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే కూరలో ఉన్న బల్లిని సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆహారంలో బల్లి రావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజన నాణ్యతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని

బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి

షాద్‌నగర్ బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్‌నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యాడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యాడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతో నిత్యం గొడవ పడేది.
ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు, ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని, చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

- ఏపీకి మళ్లీ వర్ష గండం

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి ఏపీ ఇంకా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.తీర ప్రాంతాల్లో గంటకు 45?55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రంలో అలజడి ఉండే అవకాశం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి.ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం ఏర్పడటంతో కోస్తా జిల్లాల ప్రజల్లో ఆందోళన మొదలైంది.వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండండి.

రాజకీయ అండతో అక్రమ నిర్మాణాలు.?

- అధికారులకే బిల్డర్ల బెదిరింపులు.?
- చర్యలు తీసుకుంటే బదిలీ చేయిస్తామంటూ హెచ్చరికలు.?
- నిబంధనలు బేఖాతరు, ఆదేశాలకూ లెక్కలేదా.?
- అయ్యప్ప సొసైటీలో నిర్మాణాలపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్

శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులకే బెదిరింపులు ఎదురవుతున్నాయా.? రాజకీయ అండదండలు ఉంటే నిబంధనలను పక్కనపెట్టి ఎన్ని అంతస్తులైనా నిర్మించుకోవచ్చా.? అన్న ప్రశ్నలు శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో వినిపిస్తున్నాయి. కొందరు బిల్డర్లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులు ఇచ్చిన ఆదేశాలను సైతం కొందరు అక్రమ నిర్మాణదారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలో కొందరు బిల్డర్లు ఎదురుతిరుగుతూ తమపై చర్యలు తీసుకుంటే బదిలీ చేయిస్తామంటూ హెచ్చరిస్తున్నారనే ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన క్షేత్రస్థాయి సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు, బిల్డర్ల బెదిరింపులకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడితే అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు.? ప్రజాధనంతో పనిచేసే ప్రభుత్వ యంత్రాంగాన్ని వ్యక్తిగత పలుకుబడితో శాసించాలనుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు అనుమతులకు మించి నిర్మాణాలు జరుగుతున్నాయా.? సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి నోటీసులు జారీ అయ్యాయి.? జారీ చేసిన నోటీసులపై తదుపరి చర్యలు తీసుకున్నారా.?సిఎంసి మున్సిపల్ కమిషనర్ పరిధిలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు నిర్మాణాలను కూల్చి వేయకుండా సెటిల్మెంట్లు చేసుకుంటున్నారా.? నిర్మాణ పనులు నిలిపివేయాలన్న ఆదేశాలు ఉంటే వాటిని ఎందుకు అమలు చేయడం లేదు.? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైన సీఎంసీ ఉన్నతాధికారులు అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు, నిర్మాణాల వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులైన బిల్డర్లతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వహించే అధికారులకు ఉన్నతాధికారులు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలు విద్యార్థులకు చాలా విధాలుగా సహకరిస్తాయి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

కరీంనగర్ అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో సైతం పై చేయి సాధిస్తున్నారు.క్రీడలు విద్యార్థులకు చాలా ఉపకరిస్తాయి.రాష్ట్ర స్థాయి ఉషు పోటీలలో బంగారు పతక వివిధ క్రీడల్లో అత్యధిక సంఖ్యలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక లాభాలు చేకురుతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.క్రీడలు విద్యార్థులకు చాలా విధాలుగా సహకరిస్తాయని ప్రత్యేకంగా ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలో లోని అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలోని విద్యార్థులు అత్యధిక సంఖ్యలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని మరియు కావలసినటువంటి వనరులు సైతం కల్పించి నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయలచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి క్రీడల పోటీలలో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని చెప్పారు.అద్భుతమైన విజయాలు నమోదు చేస్తున్నామని మరియు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు.ఈ క్రమంలో కరీంనగర్ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించినటువంటి ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి అండర్ 19 వివిధ పోటీలలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని వారు తెలిపారు.ఉషు ఖేలో ఇండియా లో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించిన ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి ఉషు పోటీలలో కళాశాలకు చెందినటువంటి కే.స్నీతిక 45 కిలోల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నదని సంతోషం వ్యక్తం చేశారు మరియు జమ్మూ కాశ్మీర్లో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనదని చెప్పారు.జిల్లా స్థాయి అండర్ 19-పోటీల విజేతలు ఉ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక ఎస్ జి ఎఫ్ వాలీబాల్ ఎస్.చక్రిత,ఎస్ జి ఎఫ్ ఖో-ఖో ఏం.కార్తీక,ఎస్ జి ఎఫ్ టేబుల్ టెన్నిస్ ఏ.మనస్వి,ఎస్ జి ఎఫ్ హాకీ కే.స్నీతిక,వి అక్షర,కె సాక్షరడఏ.ఆశ్రిత,ఎస్ జి ఎఫ్ భాస్కెట్ బాల్ రమ్యశ్రీ విజేతలందరికీ పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అద్భుత ప్రదర్శన కనబరచాలని మరియు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గ్రామీణ పర్యటన

- పింఛన్ల పంపిణీ, తాగునీరు మరియు వ్యవసాయ పరిస్థితుల సమీక్ష
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సి.కె. పల్లి, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం రోజున సి.కె. పల్లి మండలం, అమిదాలకుంట,ఓబుళం పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో జరుగుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరియు ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.అమిదాలకుంట గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ గారు తనిఖీ చేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సకాలంలో పింఛన్ అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇద్దరు వయోవృద్ధులకు స్వయంగా వృద్ధాప్య పింఛన్లను (రాంఖ) అందజేశారు.గ్రామంలో త్రాగునీటి ఎద్దడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్థులను ఆరా తీశారు. శ్రీ సత్యసాయి త్రాగునీటి పథకం ద్వారా ఉచితంగా సరఫరా అవుతున్న నీరు గ్రామంలోని అన్ని గృహాలకు చేరుతోందా లేదా కొన్ని వీధులకే పరిమితమైందా అనే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, తాగునీటి సరఫరా తీరుపై వివరాలు సేకరించారు.ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, సహాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉలవల విత్తనాల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందనే అంశంపై అధికారులతో సమీక్షించి, ప్రణాళికాబద్ధంగా విత్తనాలు అందించాలని ఆదేశించారు.ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటల వివరాలను కలెక్టర్ రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము ప్రస్తుతం వేరుశనగ పంటను ప్రధానంగా సాగు చేస్తున్నామని రైతులు కలెక్టర్ గారికి వివరించారు.ఈ పర్యటనలో జిల్లా, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి.
- వార్షిక తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, ఈ-చలాన్ విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అతివేగంగా ప్రయాణించేవారు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపేవారు, ట్రిపుల్ రైడింగ్ చేసేవారు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు చేపట్టాలని తెలిపారు.

ఊటూరు-వేగురుపల్లి రోడ్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు?వేగురుపల్లి రోడ్డు సమస్యను అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.శుక్రవారం మానకొండూర్ మండలంలోని ఊటూరు గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ క్రమంలో స్థానికులు ఊటూరు?వేగురుపల్లి రహదారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే ట్రాన్స్‌కోకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.మొర్రి శంకరయ్య కుటుంబానికి పరామర్శఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మొర్రి శంకరయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఊటూరు గ్రామ పర్యటనలో భాగంగా శంకరయ్య నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. శంకరయ్య మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెలిశెట్టి కళ్యాణి కిశోర్, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు చంద్రమౌళి, స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొంగోని సునిల్, నాయకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుడాల మహేందర్, రామగిరి లక్ష్మణ్, వంతడ్పుల అనిల్, జెన్నయ్య, శ్రీనాథ్, మత్తయ్య, వెంకట్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కోసం జనసేన ఎమ్మెల్యే రూ.50 లక్షల డిమాండ్

- తిరుపతి జనసేన అభ్యర్థి రాజేష్ ఆచారి ఆత్మహత్యాయత్నం

తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్ సీట్ కోసం రూ.50 లక్షలు డిమాండ్ చేశారని తిరుపతి జనసేన అభ్యర్థి రాజేష్ ఆచారి ఆరోపించారు. 47వ డివిజన్ నామినేషన్ వేసినా, బి-ఫామ్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. హవాయి చెప్పులు వేసుకున్న వాడిని అసెంబ్లీకి పంపిస్తామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈరోజు తిరుపతిలో కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేయాలంటే 50 లక్షలు డిమాండ్ చేస్తున్నారు . తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నాశనం అయిపోతాడని అయన మండిపడ్డారు. తిరుపతిలో మొదట జనసేన పార్టీ కార్పోరేటర్ అభ్యర్థిగా కార్యాలయం ఓపెన్ చేసింది నేనే.. పవన్ కళ్యాణ్ నా చావును చూసినా తిరుపతికి వస్తారు అనుకుంటున్నని అన్నారు.

భూసారాన్ని కాపాడితేనే భవిష్యత్ ..వ్యవసాయానికి భరోసా

మాగనూరు సాగు భూముల సారవంతాన్ని కాపాడుతూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలనే లక్ష్యంతో ఖేత్ బచావో అభియాన్ ను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ తెలిపారు. నేరడగం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భూసార పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని సూచించారు. నేలలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. వరి కోత అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకర మైన సూక్ష్మజీవులు నశించడంతో పాటు, నేలలోని పోషకాలు తగ్గి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం లేదా కంపోస్టుగా తయారు చేసి వినియోగించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు పంటల మార్పిడిని పాటించాలని, వరి తర్వాత శనగ, పెసర, మినుము వంటి పప్పుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ముమ్మరంగా నైట్ పెట్రోలింగ్

- ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత.. అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా

కడప జిల్లావ్యాప్తంగా నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు సిబ్బంది నైట్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులు, కాలనీలు, రద్దీ తక్కువగా ఉండే ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసు బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద కదలికలపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తూ.. పాత నేరస్తులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. లాడ్జీలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

ఊపందుకున్న వైఎస్ఆర్సీపీ ఎంపిటిసి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

సి.బెళగల్ మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో వైయస్సార్సీపి బలపరిచిన ఎంపిటిసి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది.

పోలకల్ గ్రామంలో గల ఎంపిటిసి1 అభ్యర్థి ఈరపోగు లక్ష్మీదేవి,ఎంపిటిసి2 అభ్యర్థి గుండ్లకొండ మల్లేశ్వరి ఇద్దరు కలిసి గ్రామంలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎంపిటిసి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరుకు కాళ్లు మొక్కుతూ ఓట్లు అడగగడంతో ఓటర్లు ఆకర్షితులవుతున్నారు.ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు పులిరాజు,కంపాడు నరసింహులు, బాలరాజు,చిన్న కొండయ్య,బొంతల సోమప్ప, సంటెన్న,ఎర్రన్న,లక్ష్మన్న,శేఖర్ బాబు,సుధాకర్,బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు

వినూత్న నిరసనకు దిగిన రైతులు

ఆదిలాబాద్ ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వినూత్న నిరసనకు దిగారు. ఎండిన పత్తి మొక్కలతో రాహుల్ గాంధీకి రైతుల సెల్ఫీలుపంపారు. ముఖరా (కే) గ్రామ రైతులు ఎండిపోయిన పత్తి మొక్కలతో సెల్ఫీలు దిగి రాహుల్ గాంధీకి పంపారు. ఇది దేవుడు ఇచ్చిన కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అంటూ నినాదాలు చేసారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసారు . పత్తి పంటకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు.

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని అడ్డుకున్న ఎంఐఎం నేతలు

నిజామాబాద్ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మజ్లిస్ నేతలు అయన మండిపడ్డారు. నిజామాబాద్ నగర శివారులోని అర్సపల్లి వద్ద సుదర్శన్‌రెడ్డి కాన్వాయ్ అడ్డగించారు. వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని మజ్లిస్ నేతలు డిమాండ్ చేసారు. పోలీసులు అడ్డుకున్నా పట్టు వదలలేదు. చివరకు సుదర్శన్ రెడ్డి క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

బహుదా ఉగ్రరూపం..

జాతీయ రహదారిపై వరద బీభత్సం

కొజ్జిరియా టోల్‌గేట్ సమీపంలో నిలిచిన వాహనాలు..

ఇరువైపులా ట్రాఫిక్ స్తంభన

ఎస్పీ మహేశ్వరరెడ్డి నిరంతర పర్యవేక్షణ, దశలవారీగా వాహనాల రాకపోకలు

శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) అర్నాబ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు శ్రీకాకుళం జిల్లాలో జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఎగువ ప్రాంతమైన ఒడిశాతో పాటు జిల్లాలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బహుదా నది ఉప్పొంగింది. వరద ప్రవాహం ఉధృతంగా మారడంతో ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొజ్జిరియా (బిల్లపాడ) టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రంగంలోకి పోలీసు యంత్రాంగం..

వరద పరిస్థితిని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ఐపీఎస్ స్వయంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ హైవే పోలీసు అధికారులు, స్థానిక పోలీసు సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. వరద నీటి ఉధృతి, రహదారి పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

దశలవారీగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ..

వరద ఉధృతి నేపథ్యంలో ఒకేసారి భారీ సంఖ్యలో వాహనాలను రహదారిపైకి అనుమతించకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని పరిస్థితులకు అనుగుణంగా దశలవారీగా వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. హైవే పోలీసు సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటూ వాహనాల రద్దీని పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన సూచనలు అందిస్తూ ట్రాఫిక్ నిర్వహణ చేపడుతున్నారు.

భద్రతకే తొలి ప్రాధాన్యం..

వరద ప్రవాహం కారణంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తక్షణ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారిపై వాహన రాకపోకలు సురక్షితంగా, సజావుగా సాగేలా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోంది. వరద ఉధృతిని బట్టి ట్రాఫిక్ నియంత్రణ కొనసాగిస్తూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.వరద తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తతే లక్ష్యంగా పోలీసులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

కనకదుర్గమ్మకు 100.500 గ్రాముల బంగారు హారం సమర్పణ

నరసరావుపేటకు చెందిన భక్తురాలు

శ్రీ వర్షిణి కుటుంబం కానుక

దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో

అమ్మవారి దర్శనం.. వేద పండితుల ఆశీర్వచనం

విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మకు భక్తులు బంగారు కానుక సమర్పించారు. అమ్మవారిపై తమకున్న అపార భక్తి ప్రపత్తులకు నిదర్శనంగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కుమారి శ్రీవర్షిణి 100.500 గ్రాముల బరువైన బంగారు హారాన్ని శుక్రవారం ఆలయానికి అందజేశారు. నరసరావుపేటకు చెందిన కే. జగన్మోహనరెడ్డి కుమార్తె శ్రీవర్షిణి కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు హారాన్ని ఆలయ అధికారులకు సమర్పించారు.

ఆలయ మర్యాదలతో దర్శనం..

బంగారు హారం సమర్పించిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ మర్యాదలతో శ్రీ కనకదుర్గమ్మ దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేదోక్తంగా ఆశీర్వచనం అందజేశారు.ఆలయ ఉప ప్రధానార్చకులు బి. శంకర శాండిల్య దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. భక్తితో అమ్మవారికి బంగారు హారం సమర్పించిన శ్రీవర్షిణి కుటుంబాన్ని ఆలయ వర్గాలు అభినందించాయి.

తినే అలవాటులో మార్పులు, సంతానం లేక అరుపులు

- గర్ల్స్ హాస్టల్ ముసుగులో అండాలను అక్రమ రవాణా

- సంతాన సాఫల్య కేంద్రాలకు అండాల సరఫరా

- సికింద్రాబాద్ బేగంపేట్ గర్ల్స్ హాస్టల్ లో అర్ధరాత్రి దాడులు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రెండు తెలుగు రాష్ట్రాల్లో గత మూడు దశాబ్దాలుగా యువతలో వినూత్నమైన మార్పులు నెలకొన్నాయి.ముఖ్యంగా ఇంటి భోజనానికి దూరమై హోటల్ జంక్ ఫుడ్ కి దగ్గరైన్నారు.మద్యం ధూమపానం ఇంకా వివిధ రకాలైన మత్తు పదార్థాలకు దగ్గరయ్యి జీవితాలు నాశనం చేసుకుంటున్న యువత.

- లేటెస్ట్ ట్రెండ్ లో మునిగి తేలుతున్న యువత

కళాశాల విద్యాభ్యాసం నుంచే చెడు అలవట్లకు దగ్గరయి జీవితాలను తలకిందులు చేసుకుంటున్న ఈ తరం యువత.సరికొత్త పోకడాలతో 3స్టార్, 5స్టార్ నగరంలో హోటల్లు వేల సంఖ్యలో వెలగడం వాటిల్లో విదేశీ,స్వదేశీ మద్యంతో పాటు జంక్ ఫుడ్ను భుజిస్తూ జీవితాలను నాశనం చేసుకోవటమే కాకుండా వివిధ రకాల రుగ్మతులకు దగ్గరవుతున్నారు.

- కొత్త పోకడలతో చిత్తౌతున్న చిరంజీవులు

ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా చిన్న పెద్ద తేడా లేకుండా ఇంటి ఫుడ్ కు చెక్ పెడుతూ ఆన్లైన్ సేవలకు దగ్గరౌతూ రుచికరమైన భోజనానికి అలవాటుపడుతూ, దీర్ఘకాలిక రుగ్మతలు స్థూలకాయం,డయాబెటిస్, గుండె జబ్బులు,సంతాన వైఫల్యానికి కారణాలు ఇతరత్రా ఇబ్బందులు వస్తున్నాయి.

- ఆధునిక పరిజ్ఞానం, అయోమయంలో అమాయిక ప్రజానీకం

యువత ఫోన్లో,ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్ లాంటి పలు యాప్లను రోజువారి సమయంలో ఎక్కువ శాతం వాడటం వల్ల వాటికి వ్యాస పరులవుతున్నారు. దీనివల్ల శారీరకంగా, మానసికంగా తీవ్రమైన దుష్ప్రభావాలకు దారితీస్తుంది. అలాగే ఈ తరం సాఫ్ట్వేరు ఉద్యోగాలు ఎక్కువగా రాత్రి వేలో ఉండటం,ఒకే చోటున ఎక్కువగా కూర్చోవడం, గంటలకొద్ది కంప్యూటర్లు చూడటం,శారీరక పని లేక ఒత్తిడికి గురయ్యి ఆరోగ్య సమస్యలకు

దగ్గరవుతున్నారు. అలాగే ఆలుమగలు వైవాహిక జీవితాన్ని కోల్పోతున్నారు. అదిగాక సంతానం లేని సమస్యలు వారిని చూట్టు ముట్టి కొత్త ఇబ్బందులకు కేంద్ర బిందువుగా మారుతున్నారు.గచ్చేంద్రం లేక ఫెర్టిలిటీ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.దీన్ని ఆసరాగా తీసుకుని ఫెర్టిలిటీ కేంద్ర నిర్వాహకులు క్యాష్ చేసుకోవడానికి రకరకాల ఎత్తుల వేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోతున్నారు. ఈనేపథ్యంలో బేగంపేట్, ప్రకాశనగర్ లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన. నగ్రాన్ అపార్టుమెంటులో అమినితా గర్ల్స్ హాస్టల్లో బిహార్, ఉత్తరప్రదేశ్,ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమారు పది మంది యువతులును ఉంచి, అమ్మాయిల అండాలు అబ్బాయిల విర్యాని సేకరిస్తూ సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారనే సమాచారంతో బేగంపేట, ఎస్వోటీ పోలీసులు కలిసి నగ్రాన్ అపార్ట్మెంట్ పై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు.హాస్టల్ లో నివాసం ఉంటున్న పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకుని అందులో ఉన్న మహిళలను ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది కాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరిట ఈ వ్యవహారం నడుస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.ఈ ఘటన పై బేగంపేట పోలీసులు ఓ మహిళలను అనుమానించి ఆమెను అన్ని కోణాలలో విచారిస్తున్నారు.ఆ ముఠా నాయకురాలు యువతులతో ఎలాంటి వ్యాపారం నిర్వహించిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీస్

అధికారులు.

- చేవెళ్ల ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీ కలకలం..

ఈ అసాంఘిక కార్యకలాపాల్లో సుమారు 108 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురికి గంజాయి పాజిటివ్ ఉన్నట్లు సమాచారం.చేవెళ్లలోని ఓ ఫామ్ హౌస్ లో రహస్యంగా నిర్వహిస్తున్న రేవ్ పార్టీని ఎస్ ఓ టి,చేవెళ్ల పోలీసులు కలిసి భగ్నం చేశారు.ఈ పార్టీలో 108 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గుర్తించిన పోలీస్ అధికారులు.ఈ రేవ్ పార్టీలో అమ్మాయిలు పాల్గోనడం విశేషం.తనిఖీల్లో ముగ్గురికి గంజాయి పాజిటివ్గా రావడం కలకలం రేపింది.రేవ్ పార్టీ నిర్వాహకులతో పాటు పలువురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్మెట గ్రామంలో ఉన్న ఎల్జి ఫామ్ లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన నిర్వాహకుడు మన్నన్ తన స్నేహితులతో ఇంస్టాగ్రామ్ లో ప్రచారం చేసి ఈ పార్టీకి ఎంట్రీ ఫీజు రూ. 2 వేలు గా ప్రచారం చేశాడు.మన్నన్ తన ఇంస్టాగ్రామ్ పేజీ ద్వారా అక్టోబర్ 30న పార్టీ నిర్వహిస్తున్నట్లు స్నేహితులకు పరిచయస్తులకు సమాచారం ఇచ్చారని విచారణలో తేలింది.ఈ పార్టీకి హాజరయ్యే వారి నుండి వెయ్యి రూపాయల నుండి 2000 రూపాయలు ఇంటర్వ్యూలో వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. డబ్బులు చెల్లించిన వారికి చివరి నిమిషంలో ఫార్ములా లోకేషన్ పంపించి అక్కడికి రప్పించాడు.ఈ పార్టీలో ఐబిఎస్ ఐక్యూ పై కాలేజ్ విద్యార్థులు అధికంగా ఉన్నారన్నారు.ప్రధాన నిందితుడు మన్నన్ గతంలో అదే కాలేజీలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థులకు పరిచయం ఏర్పడింది ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని వారికి పార్టీ నిర్వహణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫామ్ హౌస్ లో రహస్యంగా పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటి, స్థానిక పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ప్రధాన నిందితుడు మన్నన్ తో పాటు ముగ్గురికి గంజాయి పాజిటివ్గా నిర్ధారణ అయిందని పోలీసులు పేర్కొన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి.

మత్స్యకారుల బతుకులకు భరోసా ఎప్పుడు.? వేట పడవలకు బీమా ఏదీ.?

- సముద్రం మింగేస్తుంటే.. సర్కారు సాయం ఎప్పటి వరకు

- తుపాను వస్తే పునరావాసం.. పోతే పాత సమస్యలేనా

- ఉప్పాడ తీరాన్ని కాపాడేదెవరు.? రక్షణ గోడ నిర్మాణంలో జాప్యమెందుకు.?

- దీపావళి తర్వాత తీర గ్రామాల్లో పవన్ క్షేత్రస్థాయి పర్యటన



అమరావతి (ప్రశ్న న్యూస్) సముద్రం ముందుకొస్తోంది.. తీర గ్రామాలు కనుమరుగవుతున్నాయి.. అలల ఉధృతికి రహదారులు కొట్టుకుపోతున్నాయి.. వేటకు వెళ్లిన మత్స్యకారుల బతుకులు బిక్కుబిక్కుమంటున్నాయి. తుపాను హెచ్చరికలు వచ్చినప్పుడల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం.. ప్రజల తరలింపు.. పునరావాస కేంద్రాలు.. నిత్యావసర సరుకుల పంపిణీ తుపాను వెళ్లిపోయాక మళ్లీ అవే సమస్యలు.. అదే అభద్రత ఏళ్లుగా తీర ప్రాంత ప్రజలను వెంటాడుతున్న ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు.? సముద్ర కోత నుంచి గ్రామాలను కాపాడే రక్షణ గోడలు ఎప్పుడు పూర్తవుతాయి.? వేట పడవలకు బీమా కల్పించే భరోసా ఎప్పుడొస్తుంది.? తీర ప్రాంత మత్స్యకారుల దీనస్థితిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. తాత్కాలిక సహాయక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేయాలని కాకినాడ జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అలల దెబ్బకు ఉప్పాడ విలవిల.. రక్షణ గోడ ఏదీ

ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్ర కోత సమస్య ఏళ్లుగా ప్రజలను కలవరపెడుతోంది. సముద్రపు అలలు తీరాన్ని మింగేస్తుంటే గ్రామాల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. రక్షణ గోడ నిర్మాణం కోసం డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన పనులను వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కోనపాపపేట వరకు రక్షణ గోడ పొడిగింపునకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థకు పంపిన ప్రతిపాదనలకు త్వరితగతిన ఆమోదం పొందేలా చూడాలని స్పష్టం చేశారు. సముద్రం గ్రామాలను మింగేసిన తర్వాత స్పందించడం కాదు.. ముందుగానే రక్షణ కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం.

బీచ్ రోడ్డు ధ్వంసం.. ప్రజలకు ప్రయాణ కష్టాలు

ఉప్పాడ--కాకినాడ బీచ్ రోడ్డు తుపాను అలల ధాటికి పూర్తిగా దెబ్బతింది. రహదారి దెబ్బతినడంతో తీర ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రకృతి ప్రకోపానికి రహదారులు కొట్టుకుపోతుంటే పునరుద్ధరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వేటకు వెళ్తే ప్రాణభయం.. పడవ మునిగితే అప్పుల భారం

మత్స్యకారుల ప్రధాన జీవనాధారం వేట. సముద్రంలో వాతావరణం ఒక్కసారిగా మారితే పడవలు, వలలు, ఇతర పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒక్క పడవ నష్టపోతే ఆ కుటుంబం జీవనాధారమే దెబ్బతింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వేట పడవలకు బీమా సౌకర్యం కల్పిస్తే మత్స్యకారులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీపావళి తర్వాత స్వయంగా మత్స్యకార గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అధ్యయనం చేస్తానని ప్రకటించారు. ఈ పర్యటనతోనైనా దశాబ్దాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అన్నది తీర ప్రాంత ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

10 వేల మందికి పైగా తరలింపు.. 102 పునరావాస కేంద్రాలు

అర్నబ్ తుపాను ముప్పు నేపథ్యంలో కాకినాడ జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. 92 తీర ప్రాంత ఆవాసాల నుంచి 10 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి 102 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించడంపై అధికారులను అభినందించారు. సూరాడపేట, మాయాపట్నం, కొత్తపట్నం, నాయకర్ కాలనీల్లోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్పందించి 24 గంటల్లో నీటిని పూర్తిగా తొలగించిన యంత్రాంగాన్ని ప్రశంసించారు. అయితే తుపాను సమయంలో ప్రజలను తరలించడం ఎంత ముఖ్యమో.. భవిష్యత్తులో ముంపు ముప్పు తగ్గించే శాశ్వత చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. చీకట్లో గ్రామాలు..

తుపాను గాలుల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భోగాపురం, నరసింగపురం, చిత్రాడ ఎస్సీ కాలనీ, మల్లం, విరవాడ ప్రాంతాల మధ్య విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. మరమ్మతుల అనంతరం కొన్ని చోట్ల వైర్లు కాలిపోయినట్లు సమావేశంలో ప్రస్తావించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

నష్టపరిహారం లెక్కల్లో అక్రమాలకు తావుండొద్దు..

తుపాను కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పంటలు, పడవలు, వలలు, మగ్గాలకు జరిగిన నష్టాన్ని త్వరగా అంచనా వేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. రైతులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు న్యాయం జరిగేలా నష్టపరిహారం అందించాలని స్పష్టం చేశారు. నష్టపోయిన ప్రతి అర్హ కుటుంబాన్ని గుర్తించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

బియ్యం పంపిణీతోనే బాధలు తీరుతాయా.?

ముంపు ప్రాంతాల ప్రజలకు 25 కిలోల బియ్యం, మత్స్యకారులు, చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యం అందించాలని ఆదేశించారు. పప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార తదితర నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేయాలని సూచించారు. సరుకుల కొరత లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అయితే తక్షణ సాయం అందించడం ఒక ఎత్తయితే.. భవిష్యత్తులో ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా చూడటం మరో ఎత్తు.

45 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలకు అభినందనలు

తుపాను సమయంలో ప్రాణనష్టం జరగకుండా సమన్వయంతో పనిచేసిన పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందిని పవన్ కల్యాణ్ అభినందించారు. సహాయక చర్యల్లో పాల్గొన్న 45 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సేవలను ప్రశంసించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు కృషి చేస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగాల సిబ్బందిని అభినందించారు.

హామీలు ఆచరణలోకి వస్తాయా.?

తుపాను వెళ్లిపోతుంది, అధికారులు తమ విధులకు తిరిగి వెళ్తారు, కానీ తీర ప్రాంత ప్రజలకు మాత్రం సముద్రం ముప్పు నిత్య సమస్యగానే మిగులుతోంది. ఉప్పాడ రక్షణ గోడ, కోనపాపపేట వరకు పొడిగింపు, బీచ్ రోడ్డు పునరుద్ధరణ, వేట పడవలకు బీమా వంటి అంశాలు కాగితాలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఉంది. దీపావళి తర్వాత పవన్ కల్యాణ్ ప్రకటించిన క్షేత్రస్థాయి పర్యటనలో మత్స్యకారుల సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు లభిస్తాయో చూడాలి. తీర ప్రాంత ప్రజలకు కావాల్సింది తుపాను వచ్చినప్పుడు అందించే తాత్కాలిక సాయం మాత్రమే కాదు.. తుపాను వచ్చినా తమ ఇళ్లు, జీవనాధారం సురక్షితంగా ఉంటాయనే శాశ్వత భరోసా పవన్ కళ్యాణ్ ఇస్తారా.?

'ఆదర్శ కుటుంబం' మూవీ రివ్యూ

కుటుంబ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ కథానాయకుడు వెంకటేష్. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలను తనదైన శైలిలో తెరకెక్కించే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఇక ఇద్దరి కలయికలో సినిమా కోసం గత కొంత కాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే 'ఆదర్శ కుటుంబం'. యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు ఆసక్తికరమైన క్రైమ్ మిస్టరీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను అలరించిందా? వెంకీ-త్రివిక్రమ్‌ల జోడీ ఆడియన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్ అందించిందా? లేదా తెలుసుకుందాం..

చిట్టిబాబు (వెంకటేష్) ఓ మిడిల్ క్లాస్ ప్రైవేట్ ఉద్యోగి. భార్య స్వర్ణ (నిధి) చిట్‌ఫండ్స్ బిజినెస్‌లో మోసపోయి అప్పులపాలవుతుంది. ఇక చదువు అంతంత మాత్రమే ఉంటూ గుండెలో రంధ్రంతో బాధపడే కొడుకు సర్వ (ప్రజ్వల్). మెకానిక్‌తో ప్రేమాయణం నడుపుతూ కాలేజీలో చదువుకునే అమ్మాయి సంపూర్ణ (యువీనా).. ఇలా కుటుంబ సభ్యులతోనే పలు సమస్యలతో బాధపడే చిట్టిబాబుకు లాటరీలో రూ.100 కోట్లు వస్తాయి. అప్పటి వరకు అద్దె ఇంట్లో సర్దుకుపోయిన ఈ కుటుంబం ఒక్కసారిగా ఓ రిచ్ గెటెడ్ కమ్యూనిటీలో హౌస్ నెం.47 అనే విల్లాకు మారిపోతారు. ఖరీదైన కారును కొనుగోలు చేస్తారు. ఇదే సమయంలో ఖరీదైన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దోచుకునే బీహార్ గ్యాంగ్ దోపిడి ముఠా దృష్టి చిట్టిబాబు ఫ్యామిలీపై పడుతుంది. అప్పుడు ఏం జరిగింది? ఆ బీహార్ గ్యాంగ్‌ను చిట్టిబాబు ఎలా ఎదుర్కొన్నాడు? తమ కుటుంబాన్ని కాపాడుకోవడానికి చిట్టిబాబు కుటుంబం చేసిన సాహసాలేంటి? ఇందుకోసం ఈ కుటుంబానికి పోలీస్ ఆఫీసర్ దామోదర్ నాయుడు (నారా రోహిత్) ఎలాంటి సహకారాన్ని అందించాడు? ఈ కథకు డీఎస్పీ బృహస్పతి రావు (రావు రమేష్) కు ఉన్న సంబంధమేమిటి? మాలతి (నివేదా పేతురాజ్), చిత్తరంజన్ (సత్య) పాత్రలు ఈ సినిమాలో ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

త్రివిక్రమ్ సినిమా అంటే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లు అని అనుకునే ప్రేక్షకులకు ఈ సినిమా కొత్తగా అనిపించే విధంగా తన బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు.. యాక్షన్.. క్రైమ్ అంశాలను జోడించి దర్శకుడు త్రివిక్రమ్ ఈసినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా ఫస్టాఫ్ అంతా త్రివిక్రమ్ స్టయిల్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో.. వెంకటేష్ తరహా ఫ్యామిలీ అంశాలతో కొనసాగుతుంది. అప్పటి వరకు సరదాగా సాగిన ఫస్టాఫ్‌లో ఇంటర్వెల్ బ్యాంగ్ ఒక్కసారిగా అందరిని ఉలిక్కిపడేటట్టు చేస్తుంది. అక్కడి నుంచి ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి పెరుగుతుంది. ఈ ఫస్టాఫ్‌లోనే భార్య చేసిన అప్పుల వల్ల.. పిల్లల సమస్యల వల్ల చిట్టిబాబు పడే తిప్పలు వినోదాన్ని పంచుతాయి. అయితే చిట్టిబాబుకు రూ.100 కోట్ల లాటరీ వచ్చిన తరువాత ప్రేక్షకుల్లో కూడా ఓ తెలియని హుషారు, ఎనర్జీ వస్తుంది. కథనంలో కూడా వేగం పెరుగుతుంది. అయితే సెకండాఫ్‌లో వచ్చే కథ ప్రేక్షకుల ఊహకు అందే విధంగా ఉండటంతో అక్కడక్కడా మినహా ప్రేక్షకులు పెద్దగా థ్రిల్లగా ఫీలయ్యే అవకాశం ఉండదు. దీంతో పాటు సెకండాఫ్‌లో చిట్టిబాబు కుటుంబ సభ్యుల ఫ్లాష్‌బ్యాక్ ఏపిసోడ్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేసిన అది కన్విన్సింగ్ అనిపించదు. సెకండాఫ్‌లో త్రివిక్రమ్ రచన మరింత పదునుగా ఉంటే సినిమా ఆద్యంతం ఎంగేజింగ్‌గా ఉన్న ఫీలింగ్ కలిగేది. సత్య కామెడీ కూడా అక్కడక్కడా మాత్రమే నవ్విస్తుంది. సత్య కామెడీ టైమింగ్‌ను కూడా త్రివిక్రమ్ పూర్తి స్థాయిలో వాడుకోలేదని అనిపిస్తుంది. సెకండాఫ్‌లో చాలా సన్నివేశాలు సాగదీసిన భావన కలుగుతుంది. ఇటీవల వచ్చి ప్రేక్షకుల అభినందనలు అందుకున్న 'బ్లాస్ట్'చిత్ర కథ.. ఈ సినిమా కథకు పోలికలు ఉన్నాయని గతంలో చర్చ జరిగింది. అయితే ఈ సినిమాలో ఒక్క ఇంటర్వెల్ బ్యాంగ్ మినహా ఎక్కడా కూడా బ్లాస్ట్ చిత్రానికి ఈ చిత్రానికి పోలికలు ఎక్కడా కనిపించవు. ఓవరాల్‌గా అక్కడక్కడా మెప్పిస్తూ.. మరికొన్ని చోట్ల రొటిన్ భావన కలిగిస్తూ 'ఆదర్శ కుటుంబం' ఆడియన్స్‌ను ఓ మోస్తరుగా ఎంటర్‌టైన్ చేస్తుంది. ఎక్కువ అంచనాలు పెట్టుకోకుండా వెళితే.. ఆదర్శ కుటుంబం డీసెంట్ ఫిల్మ్ అనిపిస్తుంది. చిట్టిబాబు పాత్రలో వెంకటేష్ తనదైన కామెడీ పండించాడు. ఆయన నటనే ఈ చిత్రానికి ప్రధాన బలం. స్వర్ణగా నిధి శెట్టి అమాయకపు భార్య పాత్రతో పాటు సినిమాలో వచ్చే ట్విస్ట్‌లో యాక్షన్ ఏపిసోడ్‌లో అదరగొడుతుంది. పిల్లలుగా యువీనా, ప్రజ్వల్ మెప్పిస్తారు. పోలీస్ పాత్రలో నారా రోహిత్ కరెక్ట్‌గా కుదిరాడు. సత్య కామెడీ సినిమాలో కొన్ని చోట్ల రిలీఫ్‌గా అనిపిస్తుంది. రఘుబాబు, బ్రహ్మాజీ, నివేదితా పేతురాజ్, రావు రమేష్‌లు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు త్రివిక్రమ్ ఫస్టాఫ్‌లో రాసుకున్న కుటుంబ భావోద్వేగాలు, వినోదం మెప్పించాయి.అయితే సెకండాఫ్‌లో కథనంలో ఇదే ఫ్లో ఉంటే బాగుండేదనిపించింది. సెకండాఫ్‌లో కూడా కొన్ని సన్నివేశాలు బలంగా ఉంటే సినిమా ఫలితం రేంజ్ పెరిగేది. అయితే ఈ సినిమాలో కొన్ని త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు మాత్రం అలరిస్తాయి. 'పదివేలు రెండు సార్లు లెక్కపెడితే 20వేలు అనుకునే అమయాకురాలు మా ఆవిడ'. ప్రతి ఎక్స్‌ప్రెషన్ ముఖంపై కనిపించడానికి నేనేమైనా మోహన్ లాలా? కమల్‌హాసనా?.. ఇలాంటి డైలాగ్స్ అలరిస్తాయి. తమన్ సంగీతం పెద్దగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. నేపథ్య సంగీతం కూడా కథను డిస్ట్రబ్ చేసే విధంగానే అనిపించింది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

విమానంలో కీర్తి సురేష్‌కు చేదు అనుభవం.. మద్యం మత్తులో సెల్ఫీ కోసం వేధించిన ప్రయాణికుడు!

మహానటి కీర్తి సురేష్ ప్రస్తుతం వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'డోరతీ' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆమె.. ఇప్పుడు 'అక్క' అనే క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌తో ఓటీటీలోకి అడుగుపెట్టబోతున్నారు. రాధిక ఆప్టేతో కలిసి నటించిన ఈ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. ఇది కీర్తి సురేష్ కెరీర్‌లో తొలి వెబ్ సిరీస్ కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో సిరీస్ ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఆమె బయటపెట్టారు. తన భర్త ఆంటోని థట్టిల్‌తో కలిసి విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో ఓ ప్రయాణికుడు తనను ఇబ్బంది పెట్టినట్లు కీర్తి వెల్లడించారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండి, సెల్ఫీ కావాలంటూ పదేపదే ఒత్తిడి చేశాడని చెప్పారు. వేచి ఉండమని చెప్పినా వినిపించుకోకుండా వెంటనే ఫొటో దిగాలని పట్టుబట్టడంతో తాము అసౌకర్యానికి గురయ్యామని వివరించారు. ఈ ఘటన గురించి కీర్తి మాట్లాడుతూ.. "నేను, నా భర్త ఆంటోని కలిసి మిలాన్ నుంచి భారత్‌కు విమానంలో వస్తున్నాం. ఆ సమయంలో ఓ వ్యక్తి నన్ను సెల్ఫీ అడిగాడు. అయితే అతడు మద్యం మత్తులో ఉన్నాడు. సరిగా నిలబడలేని పరిస్థితిలో కనిపించాడు. కాసేపు వేచి ఉండమని చెప్పినా వినిపించుకోకుండా ఇప్పుడే సెల్ఫీ కావాలని ఒత్తిడి చేశాడు. నేను ఎప్పుడు ఫొటో దిగాలన్నది మీరు నిర్ణయించకూడదని అతడికి స్పష్టంగా చెప్పాను. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. నా భర్త కూడా అతడిని వారించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వినకపోవడంతో విమాన సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాల్సి వచ్చింది" అని తెలిపారు. అభిమానులు తనను కలవడం, మాట్లాడటం, ఫొటోలు దిగడం తనకు ఎప్పుడూ ఇష్టమేనని కీర్తి చెప్పారు. అయితే అభిమానమనే పేరుతో వ్యక్తిగత హద్దులు దాటి ప్రవర్తించడం మాత్రం ఇబ్బందికరమని ఆమె అభిప్రాయపడ్డారు. కొందరు అభిమానులు ఎంతో ఆప్యాయంగా పలకరిస్తారని, సెల్ఫీ అడగకుండానే తనతో సరదాగా మాట్లాడి వెళ్లిపోతారని చెప్పారు. అలాంటి అభిమానుల తీరు తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. అభిమానాన్ని వ్యక్తం చేయడంలోనూ ఎదుటివారి వ్యక్తిగత స్వేచ్ఛను, పరిస్థితిని గౌరవించాలని ఆమె మాటల ద్వారా స్పష్టమవుతోంది. ఇక సినిమాల విషయానికి వస్తే కీర్తి సురేష్ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'జనవరి 12 విడుదల' సినిమాలో సీనియర్ హీరో వెంకటేశ్‌కు జోడీగా నటిస్తున్నారు. అలాగే విజయ్ దేవరకొండతో కలిసి 'రౌడీ జనార్ధన' అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కనిపించనున్నారు.వీటితో పాటు 'సత్యన్ సావిత్రి', 'కన్నెవీడి', 'తొట్టం', 'రాఫ్తార్' వంటి మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నాయి.

'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..

- ఆకట్టుకుంటున్న 'ఈతా' ట్రైలర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈతా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన వితాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

నోరా ఫతేహికి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు

రూ.200 కోట్ల మనీలాండరింగ్, దోపిడీ కేసులో నిందితుడైన సుకేశ్ చంద్రశేఖర్ వ్యవహారంలో ప్రముఖ బాలీవుడ్ నటి నోరాఫతేహికీ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో 2026 నవంబర్ 2న ప్రాసిక్యూషన్ సాక్షిగా హాజరై కోర్టు ఎదుట వాంగ్మూలం ఇవ్వాలని సమన్లలో పేర్కొంది. ఈ కేసులో దాఖలు చేసిన థర్డ్ సప్లిమెంటర్ చార్జ్‌షీట్‌లో నోరా ఫతేహి పేరు సాక్షిగా చేర్చారు. దీని ఆధారంగా కోర్టు విచారణకు హాజరుకావాలని రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు జారీచేసింది. ఈ మనీలాండరింగ్ కేసులో మరో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నిందితురాలిగా ఉండగా, నోరా ఫతేహి విచారణలో సాక్షిగా, అనుమానితురాలిగా ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటికే ఈ ఇద్దరు నటీమణులను పలుమార్లు విచారించింది. అయితే నోరా ఫతేహి తనపై వస్తున్న ఆరోపణలను గతంలోనే ఖండించింది.

జయలలిత పాత్రలో త్రిష..

- ఎంజీఆర్ బయోపిక్‌లో కీలక పాత్రకు ఓకే చెప్పిందా!

తమిళనాడు రాజకీయాల్లో నటి త్రిష పేరు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా నటుడు విజయ్ రాజకీయ ప్రస్థానం, తమిళనాడు రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె పేరు తరచూ వార్తల్లో వినిపిస్తోంది. ఈ క్రమంలోనే త్రిషకు సంబంధించి కోలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నటి జయలలిత పాత్రలో త్రిష నటించబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. లెజెండరీ నటుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ జీవితకథ ఆధారంగా 'పురచ్చి తలైవర్ ఎంజీఆర్' పేరుతో ఓ బయోపిక్ తెరకెక్కనుంది. ఎంజీఆర్ సినీ ప్రయాణం నుంచి రాజకీయ ప్రస్థానం వరకు ఆయన జీవితంలోని కీలక ఘట్టాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఈ కథలో జయలలిత పాత్రకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండనుంది. ఎంజీఆర్‌తో కలిసి ఎన్నో సినిమాల్లో నటించిన జయలలిత.. ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళనాడు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ముఖ్యమంత్రిగా కూడా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో జయలలిత పాత్రకు త్రిషను ఎంపిక చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం ఆమెను సంప్రదించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. అయితే త్రిష ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అంగీకరించారా? ఆమెనే జయలలిత పాత్రలో ఖరారు చేశారా? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

21 రోజుల్లోనే ఓటీటీలోకి 'కామ్రేడ్ కళ్యాణ్'..

ఎలాంటి ప్రకటన లేకుండా స్ట్రీమింగ్ ప్రారంభం!

టాలీవుడ్ నటుడు శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అక్టోబర్ 9న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణతో పాటు బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అక్టోబర్ 30 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి రావడం విశేషం.శ్రీవిష్ణు, మహిమా నంబియార్ జంటగా నటించిన ఈ చిత్రానికి జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహించారు. కోన వెంకట్ సమర్పణలో వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మించారు. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సత్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో ప్రేక్షకులను నవ్వించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోనూ వినోదం పంచేందుకు సిద్ధమైంది. సాధారణంగా సినిమాలు థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలోకి రావడం ఇటీవల సాధారణంగా మారింది. కానీ 'కామ్రేడ్ కళ్యాణ్' మాత్రం కేవలం 21 రోజుల్లోనే డిజిటల్ వేదికపైకి వచ్చేసింది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే వీక్షించవచ్చు. 'కామ్రేడ్ కళ్యాణ్' కథేంటనేది చూస్తే.. ఈ సినిమా కథ 1990వ దశకంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సాగుతుంది. పెద్దగా చదువుకోని తాడికొండ కళ్యాణ్ (శ్రీవిష్ణు) ఓ గ్రామంలో థియేటర్‌ను లీజుకు తీసుకుని నడుపుతుంటాడు. మరోవైపు అడవుల్లోని నక్సలైట్ దళాలను అణచివేసేందుకు ఐపీఎస్ అధికారి జార్జ్‌కుట్టి (షైన్ టామ్ చాకో) ప్రత్యేకంగా నియమితుడవుతాడు. దీంతో మాస్టర్ (సాయిచంద్) నేతృత్వంలోని దళానికి, పోలీసులకు మధ్య పోరు కొనసాగుతుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సితార (మహిమా నంబియార్) అనే ఒడియా యువతి తన తల్లిదండ్రులతో కలిసి ఆ గ్రామానికి వస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమె తల్లి సరస్వతమ్మను (రాధికా శరత్‌కుమార్) కాపాడిన సితారను చూసి కళ్యాణ్ ప్రేమలో పడతాడు.

ఆమెతో కలిసి జీవితాన్ని గడపాలని ఆశపడతాడు. అయితే సితార కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న కళ్యాణ్.. వారిని ఆ కష్టాల నుంచి బయటపడేయాలని నిర్ణయించుకుంటాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు దుబాయ్ బాబు (సత్య) సహాయంతో ఓ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ ఆ నిర్ణయం అతడి జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. సాధారణంగా థియేటర్ నడుపుకునే కళ్యాణ్ కాస్తా పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారి 'కామ్రేడ్ కళ్యాణ్'గా ఎలా మారాడు? నక్సలైట్ దళాలకు అతడికి ఉన్న సంబంధం ఏమిటి? అతడి జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలేంటి? అనేది సినిమాలో ఆసక్తికరంగా చూపించారు.

విద్యార్థులకు పోక్సో యాక్ట్ పై అవగాహన

మేడ్చల్(ప్రశ్న న్యూస్) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మేడ్చల్ కోర్టు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి యు .తిరుపతి జడ్పిహెచ్ఎస్ గిర్మాపూర్ పాఠశాల విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలపై వివరిస్తూ వీటిని నివారించడానికి తెచ్చిన పోక్సో యాక్ట్ 2012 పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు సోషల్ మీడియాకు , ఫోన్ లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను మంచి కోసం జాగ్రతగా వాడుకోవాలని సూచించారు.ఇంకా చట్టాలు ఉల్లంఘిస్తే పడే శిక్షలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంజయ్య ఉపాధ్యాయ బృందం సత్యనారాయణ, శివకుమార్, ప్రేమ్ కుమార్, మంజుల, జనార్దన్,ఉదయశ్రీ , సుజాత విద్యార్థులు పాల్గొన్నారు

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గీతం దేశభక్తిని చాటుతుంది

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

మేడ్చల్(ప్రశ్న న్యూస్)భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గీతాన్ని ధర్మ సేవ నిరతి తెలుపుతుందని, దేశం కోసం జీవించాలని మరణించాలని దేశభక్తి చాటుతుందని ఈ గీతాన్ని ప్రతి పాఠశాలలో ఆలపించేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారుతెలంగాణ రాష్ట్రంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ మరింత బలోపేతం అవుతోందని ఇందులో భాగంగా గేమిపేట్ వద్ద నూతనంగా నిర్మించిన బాడెన్ పావెల్ స్మారక్ సభాగార్ (స్టేట్ ట్రైనింగ్ సెంటర్) ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కుత్బుల్లాపూర్ మండలంలో సభాగార్ నిర్మాణ స్థలం జీడిమెట్ల వద్ద సుమారు 8 ఎకరాల విశాలమైన ప్రాంగణాన్ని సభాగర్ నిర్మాణ కేంద్రాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ ఈ కేంద్రంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ స్టేట్ సెక్రటరీ నవీన్ నికోలస్, బీడీఎల్ డైరెక్టర్ గాయత్రి ప్రసాద్, జనరల్ మేనేజర్ టి. నరసింహం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదన కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ , జిల్లా విద్యాశాఖాధికారి రేణుక తదితర ప్రముఖులు, అధికారులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో స్కౌట్స్ & గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

వీహెచ్ చేపట్టిన వరుణ యాగంతోనే తెలంగాణలో వర్షాలు

అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్‌పేట్ శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు ఇటీవల మూడు రోజుల పాటు చేపట్టిన వరుణ యాగంతోనే తెలంగాణలో వర్షాలు పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో శ్రీ వనదుర్గ మహా రుద్ర యాగం, వరుణ యాగం నిర్వహించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి కొరత తీరాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని వరుణ దేవుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతన్నలు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో వరుణ యాగం చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో మూడు రోజుల పాటు నిర్వహించిన యాగాలు విజయవంతమై వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు.

దుద్దిల్ల శ్రీధర్ బాబు, గడ్డం వంశీ మధ్య వర్గ పోరు.?

- ఎంపీ కార్యక్రమానికి వెళ్తే సస్పెన్షనా.? కాంగ్రెస్‌లో ఇదేం క్రమశిక్షణ- వల్లెంకుంటలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులపై వేటుతో రాజకీయ చర్చ
- ఎంపీ వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదా.? - ఎంపీ పర్యటనలో పాల్గొన్నందుకే ముగ్గురిపై సస్పెన్షన్ వేటు.?
- దళిత నాయకత్వం ఎదుగుదలకు రాజకీయ అడ్డంకులున్నాయా.? - పార్టీ క్రమశిక్షణ పేరుతో స్థానిక నాయకులపై చర్యలెందుకు.?
- సస్పెన్షన్ నిర్ణయంపై పునఃసమీక్ష చేయాలంటున్న మాల మహానాడు

మంథని(ప్రశ్నన్యూస్) అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీగా ఉన్నది కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం వంశీకృష్ణ. అలాంటప్పుడు అదే పార్టీకి చెందిన ఎంపీ పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై సస్పెన్షన్ వేటు వేయడం ఎలాంటి రాజకీయ క్రమశిక్షణ.? ఒక ఎంపీ కార్యక్రమంలో పాల్గొనడం పార్టీ వ్యతిరేక చర్య ఎలా అవుతుంది.? ఎంపీ వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదా.? అనే ప్రశ్నలు ఇప్పుడు మంథని నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మల్హార్ మండలం కొయ్యూరు, మంథని నియోజకవర్గ పరిధిలోని వల్లెంకుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయడంతో పాటు వల్లెంకుంట హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలకు ఎంపీ వెంట వెళ్లినారనే కారణంతో కొయ్యూరు ఉపసర్పంచ్ లకావత్ రవీందర్,వార్డు సభ్యురాలు లక్ష్మి తిరుపతి,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కలీమ్ ఖాన్‌లను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వివాదానికి దారితీసింది.

మాల మహానాడు తీవ్ర ఖండన..

ముగ్గురు కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్‌ను మాల మహానాడు భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మెరుగు శేఖర్ తీవ్రంగా ఖండించారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ కార్యక్రమానికి హాజరైనంత మాత్రాన పార్టీ వ్యతిరేకులుగా ముద్రవేసి సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు.పార్టీ నిర్ణయాన్ని పునఃసమీక్షించి బాధిత నాయకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ వంశీకృష్ణపై ఇంత వ్యతిరేకత ఎందుకు.?పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంథని, మంచిర్యాల ప్రాంతాల్లో ఎంపీ వంశీకృష్ణ పర్యటనలు, కార్యక్రమాల సందర్భంగా తరచూ రాజకీయ వివాదాలు తెరపైకి వస్తున్నాయి. గతంలో కూడా ఎంపీ ప్రొటోకాల్, కార్యక్రమాల ఆహ్వానాలు,స్థానిక నాయకుల మధ్య ఆధిపత్య పోరు వంటి అంశాలపై కాంగ్రెస్‌లో విభేదాలు వెలుగుచూశాయి.మంచిర్యాల జిల్లాలో గూడెం గ్రామంలో పాఠశాల బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యే సమయంలో ఆయన ఫ్లెక్సీలను చింపివేయడం, ఇరువర్గాల అనుచరుల మధ్య ఉద్రిక్తత ఏర్పడడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కెతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం కూడా కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను బయటపెట్టింది.ఈ పరిణామాలు చూస్తుంటే ఎంపీ వంశీకృష్ణ కార్యక్రమాల చుట్టూ మంత్రి శ్రీధర్ బాబు మధ్య ప్రాధాన్యత,ప్రొటోకాల్, రాజకీయ ఆధిపత్యం వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతున్నాయనే చర్చకు బలం చేకూరుతోంది.

దళిత నాయకత్వం ఎదగడం ఇష్టం లేదా.?

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ స్థానం.ఇక్కడి నుంచి గెలిచిన ఎంపీ వంశీకృష్ణ కూడా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు.ఈ నేపథ్యంలో ఆయన రాజకీయ కార్యక్రమాలపై చేస్తున్న అభ్యంతరాలు, ఆయన వెంట వెళ్లే స్థానిక నాయకులపై తీసుకుంటున్న చర్యలు సామాజిక, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు రాజకీయంగా ఎదగడం, ప్రజల్లో గుర్తింపు పొందడం,తమ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తప్పా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే సస్పెన్షన్ నిర్ణయానికి కులపరమైన కారణాలున్నాయని నిర్ధారించే ఆధారాలు ప్రస్తుతం బహిరంగంగా లేవు. ఈ ఆరోపణలపై సంబంధిత పార్టీ నాయకత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

శ్రీధర్‌బాబు వర్గం, వంశీకృష్ణ వర్గం మధ్య ఆధిపత్య పోరా.?

మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వర్గాల మధ్య రాజకీయ ప్రాధాన్యత, స్థానిక కార్యక్రమాల నిర్వహణ, నాయకుల ప్రోత్సాహం వంటి అంశాలపై విభేదాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. అయితే ఈ సస్పెన్షన్ వెనుక అసలు కారణాలు ఏమిటి.? పార్టీ నిర్ణయం వెనుక స్థానిక రాజకీయ, సమీకరణాలున్నాయా.? లేక క్రమశిక్షణకు సంబంధించిన ఇతర కారణాలున్నాయా.? అన్నది పార్టీ స్పష్టం చేయాల్సి ఉంది.

పార్టీ కార్యకర్తలకు న్యాయం ఎక్కడ.?

కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేస్తారు. అలాంటి కార్యకర్తలు తమ పార్టీ ఎంపీ కార్యక్రమానికి హాజరైతేనే కావాలని సస్పెన్షన్‌కు గురి చేస్తే భవిష్యత్తులో వారు ఎవరితో కలిసి పనిచేయాలి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల కార్యక్రమాలకు హాజరుకావాలంటే కూడా రాజకీయ అనుమతులు తీసుకోవాలా.? కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారంపై జోక్యం చేసుకొని వాస్తవాలను పరిశీలించాలి. ముగ్గురు నాయకుల సస్పెన్షన్‌ను పునఃసమీక్షించి న్యాయం చేయాలని లేని పక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేలు వేర్వేరు రాజకీయ వర్గాలుగా కాకుండా ఒకే పార్టీ ప్రతినిధులుగా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తేనే కార్యకర్తల్లో విశ్వాసం నిలుస్తుంది. అధికారం ప్రజాసేవ కోసంమే కానీ ఆధిపత్య పోరాటాల కోసం కాదు అన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎప్పుడు అర్థం చేసుకుంటారో స్థానిక నాయకులకు ఎప్పుడు మనశ్శాంతి దొరుకుతుందో దేవుడికె తెలియాలి.

ప్రజారోగ్యం, రోగుల భద్రత విషయంలో రాజీ పడం

డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ప్రజారోగ్యం, రోగుల భద్రత విషయంలో రాజీ పడకుండా, చట్టాలను ఉల్లంఘించే వైద్య సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తోంది. ప్రజలకు పారదర్శకమైన వైద్య సేవలు అందేలా తనిఖీలు నిరంతరం కొనసాగనున్నాయి. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా, వైద్య రంగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం పలు వైద్య సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనుమతులు, వైద్య పరికరాల వినియోగం, సిబ్బంది వివరాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా కూకట్పల్లిలోని త్రిశూల్ డయాగ్నస్టిక్స్‌కు సంబంధించిన ప్రాంగణంలో పలు లోపాలు అధికారుల దృష్టికి వచ్చాయి. మెడిని కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ పేరుతో ఉన్న అనుమతులకు, త్రిశూల్ పేరుతో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సేవలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. సిబ్బంది వివరాలు, సిబ్బంది జాబితా, కాలుష్య నియంత్రణకు సంబంధించిన ధ్రువపత్రాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పత్రాలను పరిశీలించగా, అవసరమైన వివరాలు సమర్పించడంలో లోపాలు ఉన్నట్లు గుర్తించి అదేవిధంగా, ప్రాంగణంలో టీఎంటీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రంతో పాటు ఎక్స్‌రే యంత్రం, ఇతర వైద్య పరికరాలు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలకు సంబంధించి తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసినట్లు తనిఖీ వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ వ్యవహారంలో చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రిలో నిర్వహించిన తనిఖీల్లో, ఆసుపత్రికి సంబంధించిన తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు 23 ఏప్రిల్ 2026తో ముగిసినట్లు గుర్తించారు.

ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన పూర్తి పత్రాలను తనిఖీ సమయంలో సమర్పించడంలో విఫలమైనట్లు అధికారులు పేర్కొన్నారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం, కాలుష్య నియంత్రణ పత్రాలు, రోగులకు అందుబాటులో ఉంచాల్సిన చికిత్సా ధరల పట్టిక వంటి అంశాల్లోనూ లోపాలు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ తనిఖీల్లో భాగంగా వీఎంఆర్ హాస్పిటల్స్, మెటర్నిటీ (ఓబీజీ) అండ్ సర్జికల్ సెంటర్‌లోనూ పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. తనిఖీ వివరాల ప్రకారం, అల్ట్రాసౌండ్ యంత్రంపై స్కానింగ్ కార్యకలాపాలను గుర్తించిన అధికారులు, సంబంధిత నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో యంత్రాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధించే పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా పాటించాలి. అలాగే, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం (సీ ఇ ఏ)ప్రకారం అవసరమైన రిజిస్ట్రేషన్, అనుమతులు, సిబ్బంది వివరాలు, ఇతర

రికార్డులను నిర్వహించడం వైద్య సంస్థల బాధ్యత. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కట్టుబడి ఉంది.వైద్య సేవలు పొందే ప్రతి రోగికి పారదర్శకమైన సేవలు, చికిత్సకు సంబంధించిన సరైన సమాచారం, అందుబాటులో ఉన్న సేవలు మరియు వాటి ధరల వివరాలు తెలుసుకునే హక్కు ఉంది. ఆసుపత్రుల్లో అనుమతులు, రిజిస్ట్రేషన్, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ లేదా స్కానింగ్ సేవలకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు కనిపించినా, వైద్య సేవల్లో నిర్లక్ష్యం లేదా ఇతర అవకతవకలు ఎదురైనా ప్రజలు మౌనంగా ఉండాల్సిన అవసరం లేదు.తమకు ఎదురైన సమస్యలు, గుర్తించిన లోపాలు లేదా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయానికి లిఖితపూర్వక ఫిర్యాదు ద్వారా లేదా ఇమెయిల్ ద్వారా తెలియజేయవచ్చు. అందిన ఫిర్యాదులను సంబంధిత నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు అని తెలిపారు.

గుంటూరు కార్పొరేషన్ పోరులో రాజకీయ వేడి

కూటమి విజయంతోనే గుంటూరుకు స్వర్ణయుగం అంటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి అభ్యర్థుల గెలుపునకు నేతల పిలుపు

గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు నగర పాలక సంస్థ ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి తెరలేపుతున్నాయి. నగర అభివృద్ధి అజెండాగా కూటమి నేతలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. గత పాలనలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ వైసీపీపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణం, నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, ఫ్లైఓవర్ల నిర్మాణమే తమ ప్రాధాన్యమని ప్రకటిస్తున్నారు.శుక్రవారం శ్రీనివాసరావుపేటలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి కూటమి ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అరాచక శక్తులకు గుణపాఠం చెప్పి అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి విజయంతోనే గుంటూరుకు స్వర్ణయుగం వస్తుందని వ్యాఖ్యానించారు.2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు ప్రజలు చరమగీతం పాడారని, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో అమరావతి రాజధాని, పోలవరం, జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయని వివరించారు.మొత్తంగా గుంటూరు కార్పొరేషన్ ఎన్నికలను కూటమి నేతలు అభివృద్ధి వర్సెస్ గత పాలన అంశంగా ప్రజల్లోకి తీసుకెళు_న్నారు. మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణతో పాటు డివిజన్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు సమన్వయంతో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అయితే నగర ప్రజలు ప్రధానంగా ఆశిస్తున్న రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ఎన్నికల హామీలు ఎంతవరకు కార్యరూపం దాలుస్తాయన్నది కీలకం కానుంది.

అద్దెకు బాయ్‌ఫ్రెండ్ ఎగబడుతున్న అమ్మాయిలు ఆంటీలు

- ఆకర్షణీయ ప్రకటనల వెనుక సైబర్ మోసాల వల
- ఒంటరితనానికి ఆన్‌లైన్ పరిష్కారమా.? లేక ఆర్థిక దోపిడీకి నిలయమా.?
- కాఫీ డేట్ నుంచి షాపింగ్ వరకు ప్రత్యేక ప్యాకేజీలు
- అమ్మాయిలు, మహిళలే లక్ష్యంగా మోసగాళ్ల కొత్త ఎత్తుగడ

ప్రశ్న న్యూస్ మేడ్చల్ ప్రతినిధి చిన్న

ఒకప్పుడు ప్రేమ, స్నేహం, అనుబంధాలు మనుషుల మధ్య సహజంగా ఏర్పడేవి. కానీ మారుతున్న కాలంలో సోషల్ మీడియా ప్రభావంతో స్నేహానికీ ధర నిర్ణయించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒంటరిగా ఉన్నారా.? మాట్లాడటానికి ఎవరూ లేరా.? కాఫీ తాగడానికి, సినిమా చూడటానికి, షాపింగ్‌కు తోడుగా ఎవరైనా కావాలా.? అయితే గంటల లెక్కన బాయ్‌ఫ్రెండ్‌ను అద్దెకు తీసుకోండి అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రకటనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

గంటకు రూ.499.. పనిని బట్టి ధర

సోషల్ మీడియా వేదికలపై కనిపిస్తున్న కొన్ని ప్రకటనల్లో గంటపాటు కాఫీ తాగుతూ మాట్లాడుకోవడానికి రూ. 499, సినిమా డేట్‌కు రూ. 1,249, షాపింగ్‌కు తోడుగా రావడానికి రూ. 1,499, పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు తోడుగా రావడానికి రూ. 1,999, పది గంటల పూర్తి రోజు ప్యాకేజీకి రూ. 4,499 అంటూ ధరలు ప్రకటిస్తున్నారు. ఆకర్షణీయమైన యువకుల ఫొటోలు, ప్రత్యేక ఆఫర్లు, పూర్తి గోప్యత, భద్రత అంటూ ప్రచారం చేస్తున్నారు.

ఆంటీల నుంచి యువతుల వరకు ఆసక్తి.?

ఈ తరహా ప్రకటనలు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఒంటరిగా జీవించే మహిళలు, ఉద్యోగాలు, చదువుల కోసం కుటుంబాలకు దూరంగా ఉంటున్న యువతులు, స్నేహితుల కొరతతో బాధపడేవారు ఇలాంటి ప్రకటనలపై ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే ఎంతమంది నిజంగా ఈ సేవలను వినియోగించుకుంటున్నారు? ఎవరు డబ్బులు చెల్లిస్తున్నారు? అనే విషయాలపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులో లేవు.

ఆకర్షణ వెనుక సైబర్ మోసాల వల

ఇక్కడే అసలు ప్రమాదం దాగి ఉంది. అందమైన యువకుల ఫొటోలు చూపిస్తూ సోషల్ మీడియాలో ఖాతాలు తెరుస్తున్న కొందరు సైబర్ నేరగాళ్లు, ఆసక్తి చూపిన మహిళలతో ముందుగా స్నేహపూర్వకంగా మాట్లాడుతున్నారు. అనంతరం బుకింగ్ కన్ఫర్మేషన్, అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు పంపిన తర్వాత ఖాతాలను బ్లాక్ చేసి మాయమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఏఐతో రూపొందించిన ఫొటోలు, ఇతరుల నుంచి సేకరించిన చిత్రాలను ఉపయోగించి నకిలీ ప్రొఫైళ్లు సృష్టిస్తున్నట్లు పోలీసులు హెచ్చరించారు. వ్యక్తిగత ఫొటోలు, ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు సేకరించి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం కూడా ఉందని అప్రమత్తం చేశారు.

అనుబంధాలకు కూడా అద్దె ధరనా.?

ఈ పరిణామం సమాజంలో మరో చర్చకు తెరలేపుతోంది. ఆధునిక జీవనశైలి, ఉద్యోగ ఒత్తిళ్లు, కుటుంబాలకు దూరంగా ఉండటం, ఒంటరితనం వంటి కారణాలతో కొందరు తోడు కోసం వెతుకుతున్నారు. ఈ అవసరాన్ని కొందరు వ్యాపారంగా మార్చుకుంటున్నారా.? లేక సైబర్ నేరగాళ్లు ఇదే అవకాశంగా తీసుకుంటున్నారా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
స్నేహం, ప్రేమ, ఆప్యాయతలు డబ్బుతో కొనుగోలు చేయగలిగేవా.? కొన్ని గంటల పరిచయానికి అద్దె చెల్లిస్తే నిజమైన అనుబంధం లభిస్తుందా.? సోషల్ మీడియా ప్రకటనలను నమ్మి వ్యక్తిగత వివరాలు పంచుకోవడం ఎంతవరకు సురక్షితం.? అనే అంశాలపై ప్రజల్లో అవగాహన అవసరం.

మహిళలకు పోలీసుల హెచ్చరిక

గుర్తుతెలియని సోషల్ మీడియా ఖాతాలను నమ్మి డబ్బులు పంపవద్దని, వ్యక్తిగత ఫొటోలు, చిరునామా, ఫోన్ నంబర్లు పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

మోసపోకుండా జాగ్రత్త వహిస్తే మంచిది..

మనిషికి డబ్బు అవసరం ఉండొచ్చు, స్నేహం అవసరం ఉండొచ్చు, ఒంటరితనాన్ని పంచుకునే తోడు కూడా అవసరం కావచ్చు. కానీ ఆ అవసరాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడేవారి వలలో పడకూడదు. గంటకు రూ. 499 అంటూ మొదలయ్యే పరిచయం.. చివరకు ఆర్థిక నష్టం, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం, మానసిక వేదనకు దారితీయకూడదు. సోషల్ మీడియా మెరుపుల వెనుక ఉన్న నిజానిజాలను తెలుసుకుని అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హబ్సిగూడ చౌరస్తాలో ట్రాఫిక్ నరకం

- రెండు కమిషనరేట్ల మధ్య నలిగిపోతున్న వాహనదారులు, పట్టించుకునే నాథుడెవరు.?
- అరగంట సమయం సిగ్నల్ వద్దే స్వాహా, యూటర్న్ ఏర్పాటు హామీ ఏమైంది.?
- సమన్వయ లోపంతో ప్రజలకు తప్పని తిప్పలు, ట్రయల్ రన్ నిర్వహిస్తేనే సమస్యకు పరిష్కారం.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో ఉన్నత అధికారులు విఫలం చెందుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల అనాలోచిత నిర్ణయాలు, అతి ఉత్సాహం, మరోపక్క బాధ్యతారాహిత్యం తో ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హబ్సిగూడ చౌరస్తా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే కీలక కూడలి. అయితే ప్రస్తుతం ఈ చౌరస్తా వాహనదారులకు ట్రాఫిక్ నరకాన్ని చూపిస్తోంది. నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యస్థానాలకు వెళ్లేందుకు అరగంటకు పైగా సమయం వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా హబ్సిగూడ సిగ్నల్ వద్ద వాహనాలు బారులు తీరుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన ట్రాఫిక్ ఉన్నత అధికారులు మాత్రం సమస్యను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు కమిషనరేట్లు, బాధ్యత తీసుకునే వారేరీ.?

హబ్సిగూడ ప్రాంతం హైదరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధులతో ముడిపడిన నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక కమిషనరేట్ పరిధిలోని అధికారులు మరో కమిషనరేట్ అధికారులతో సమన్వయం చేసుకుని సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా గట్టి ప్రయత్నాలు అసలు కనిపించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పరిధి అనే సాకుతో ప్రజల సమస్యలను గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

యూటర్న్ హామీ ఏమైంది.?

గతంలో హబ్సిగూడ చౌరస్తా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా యూటర్న్ ఏర్పాటు చేస్తామని ఉన్నత అధికారులు చెప్పినప్పటికీ, ఆ హామీ కార్యరూపం దాల్చలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రకటనలకే పరిమితమైన అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎందుకు అన్వేషించడం లేదని ప్రశ్నిస్తున్నారు. యూటర్న్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అవసరమైన అనుమతులు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించడంలో జాప్యం ఎందుకని నిలదీస్తున్నారు.

సిగ్నల్ వద్దే అరగంట, ప్రజల సమయం బలి

ఉదయం, సాయంత్రం, రాత్రి రద్దీ సమయాల్లో హబ్సిగూడ సిగ్నల్ వద్ద వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఒక్కోసారి సిగ్నల్ దాటేందుకు వాహనదారులు సుమారు అరగంట సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్ పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని, ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనులపై వెళ్లేవారు ఈ ట్రాఫిక్ చిక్కుల్లో పడి సమయాన్ని కోల్పోతున్నారు. ఇంధనం వృథా కావడంతో పాటు విపరీతంగా కాలుష్యం కూడా పెరుగుతోంది. ఇతర అత్యవసర వాహనాలకు సైతం ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి ఇంత తీవ్ర సమస్యను ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

కార్యాలయాల్లో కూర్చొని కాదు, క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

గ్రేటర్ హైదరాబాద్లో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యపై ఉన్నత అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా స్వయంగా హబ్సిగూడ చౌరస్తాను సందర్శించాలని ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల ట్రాఫిక్ ఉన్నతాధికారులు సంయుక్తంగా సమావేశమై సమస్య తీవ్రతను అంచనా వేయాలి. రద్దీ సమయాల్లో ప్రత్యేకంగా ట్రయల్ రన్ నిర్వహించి, ఏ మార్గంలో ఎంతమేర వాహనాలు నిలిచిపోతున్నాయి.? సిగ్నల్ టైమింగ్‌లో మార్పులు చేయవచ్చా.? యూటర్న్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందా.? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందిస్తారా.?

ప్రజల సమయం, అంబులెన్స్, ఇంధనం, సహనాన్ని పరీక్షిస్తున్న హబ్సిగూడ ట్రాఫిక్ సమస్యపై ఇకనైనా రెండు కమీషనరేట్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు స్పందించాలి. రెండు కమిషనరేట్ల అధికారులు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రజలకు అవసరమైనది హామీలు కాదు. ఆచరణలో కనిపించే చర్యలు.
ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మరోసారి ప్రమాదాలు జరిగే వరకు లేదా ప్రజలు రోడ్లపై ఆందోళన చేసే వరకు అధికారులు వేచి చూస్తారా.? లేక ఇప్పటికైనా మేల్కొని హబ్సిగూడ చౌరస్తాకు విముక్తి కల్పిస్తారా.? అన్నది వేచి చూడాలి.

బియ్యం అక్రమ వ్యాపారులపై కొరడ నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు

మేడ్చల్(ప్రశ్న న్యూస్) బియ్యం ధర పెరుగుదలను అరికట్టడంతో పాటు అక్రమ వ్యాపార కార్యకలాపాలపై జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొరడా విధించారు. జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఉప్పల్ బాల్ నగర్ సర్కిల్ పరిధిలోని బియ్యం వ్యాపారుల దుకాణాలు గోదాములలో సహాయ పౌర సరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా తక్కువ తూకంతో అధిక ధరలకు బియ్యం విక్రయించడం, ఇతర అక్రమ వ్యాపార కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించి నలుగురు ట్రేడర్స్ పై సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులతోపాటు శాఖా పరమైన చర్యలను తీసుకోనున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు. బియ్యం వ్యాపారులందరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారులను మోసం చేసే విధంగా ప్రవర్తించిన, అక్రమ వ్యాపారాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని బాధ్యులపై క్రిమినల్ కేసులు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్కెట్లో బియ్యం లభ్యత నిలువలు ధరలను పౌరసరఫరాల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయకుండా సహకరించాలని కోరారు. ఇకపై ప్రతిరోజు బియ్యం వ్యాపార కేంద్రాలపై పౌరసరఫలాలు లీగల్ మెట్రోలాజీ, ఎన్ఫోర్స్మెంట్, అండ్ టాస్క్ ఫోర్స్ అధికారులచే నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు బియ్యం స్టాక్స్ లో అధికంగా నిలువ, చేసిన బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించినా రిజిస్టర్ ధరల పట్టికను సరిగ్గా నిర్వహించకపోయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో తప్పుడు ధ్రువపత్రాలను సమర్పిస్తే కఠిన చర్యలు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

మేడ్చల్(ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలని, తప్పుడు ధృవపత్రాలను సమర్పించినట్లయితే వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలతో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ పై సమీక్షించారు. ఈ సదర్భంగా సిఈఓ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు సజావుగా నిర్వహించడం జరుగుతుందా అని, పురోగతి పై ఆరా తీసారు. క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియ పరిశీలనలో బిఎల్ ఓలకు ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దరఖాస్తు దారులు సమర్పించిన ఫారం 18, డిగ్రీ సర్టిఫికెట్, తత్సంబధమైన ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరుగా నిర్ధారించాలన్నారు. తప్పుడు ధృవపత్రాలను సమర్పించినట్లయితే వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, అల్వాల్ ఎంఆర్ఓ రాములు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన భారత నౌకాదళం

- ఐఎన్ఎస్ విక్రాంత్‌పై తొలిసారి రఫేల్ ల్యాండింగ్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత నౌకాదళ సామర్థ్యాన్ని ఇనుమడింపజేసే దిశగా ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయంగా నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మెరైన్ యుద్ధ విమానం అక్టోబర్ 29న తొలిసారిగా విజయవంతంగా ల్యాండ్ అయింది. తొలి ప్రయత్నంలోనే ఈ ఫీట్‌ను సాధించడం ద్వారా భారత నౌకాదళం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. ఈ విజయవంతమైన ల్యాండింగ్‌తో, ఐఎన్ఎస్ విక్రాంత్ కార్యకలాపాల్లో రఫేల్ విమానాలను అనుసంధానించే ప్రక్రియలో కీలక ముందడుగు పడినట్లయింది. ప్రస్తుతం భారత నౌకాదళం గోవాలో రఫేల్ మెరైన్ విమానాలతో విస్తృతమైన ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి కార్యకలాపాలు సాగించడానికి ఈ విమానాలకు అవసరమైన మార్పులను అంచనా వేయడం, వాటి అనుకూలతను నిర్ధారించుకోవడం ఈ పరీక్షల ముఖ్య ఉద్దేశం. తాజా ల్యాండింగ్ ఈ ప్రక్రియలో ఒక ముఖ్యమైన విజయం.కాగా, భారత నౌకాదళం కోసం 26 రఫేల్ మెరైన్ విమానాల కొనుగోలుకు భారత్, ఫ్రాన్స్ మధ్య 2025 ఏప్రిల్ 28న ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. సుమారు రూ. 63,000 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో భాగంగా 22 సింగిల్-సీట్ ఫైటర్ జెట్‌లు, 4 ట్విన్-సీట్ శిక్షణా విమానాలు భారత్‌కు అందనున్నాయి. ఈ విమానాలతో పాటు ఆయుధాలు, సిమ్యులేటర్లు, పరికరాలు, లాజిస్టిక్స్ మద్దతు కూడా ఈ ప్యాకేజీలో భాగంగా ఉన్నాయి. 2030 నాటికి ఈ విమానాల డెలివరీలు పూర్తికానున్నాయి. ఈ ఒప్పందంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి కూడా పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా స్వదేశీ ఆయుధాలను రఫేల్ విమానాలకు అనుసంధానించడం, విమానాల ఫ్యూసిలేజ్‌లను భారత్‌లోనే తయారు చేసేందుకు ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం, ఇంజిన్లు, సెన్సార్లు, ఆయుధాల కోసం నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ సౌకర్యాలను దేశీయంగా ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌పై రఫేల్ తొలి ల్యాండింగ్ విజయవంతం కావడం రక్షణ రంగంలో దేశ స్వావలంబన దిశగా మరో ముందడుగుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588